

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY

PUBLISHED FROM KURNOOL ఎడిటర్: ఆవుల విజయ భాస్కర్ రెడ్డి శనివారం 23-04-2022 సంపుటి: 03 సంచిక: 219 పేజీలు: 4 వెల: రూ 3-00







## దుర్మార్గులు, రాక్షసులతో యుద్ధం చేస్తున్నాము



ఒంగోలు, ఏప్రిల్ 22, (న్యూస్ పల్స్) ప్రకాశం జిల్లా ఒంగోలులో సున్నా వడ్డీ పథకం కార్యక్రమంలో సీఎం జగన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వరుసగా మూడో ఏడాది సున్నా వడ్డీ పథకం కింద నిధులను ఆయన జమ చేశారు. అనంతరం సీఎం జగన్ మాట్లాడుతూ ప్రతిపక్షాలపై ఓ రేంజ్‌లో ఫైర్ అయ్యారు. సంక్షేమ పథకాలు అందిస్తున్న ప్రభుత్వంపై చంద్రబాబుతో పాటు ఎల్లో మీడియా గోబెల్స్ ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. ఉచిత పథకాలతో ఆర్థిక విధ్వంసమంటూ చంద్రబాబు తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. తాము రాక్షసులు, దుర్మార్గులతో యుద్ధం చేస్తున్నామన్నారు. ఏపీ మరో శ్రీలంకలా మారుతుందని విష ప్రచారం చేస్తున్నారని.. పేదరికంలో ఉండి అలమటిస్తున్న వారికి పథకాలు అమలు చేయడానికి వీల్లేదని దుష్టచతుష్టయం అంటోందని ఆరోపించారు. అటు తమ ప్రభుత్వం మంచిది కాదని చంద్రబాబు దత్తపుత్రుడు చెబుతున్నారని పవన్ కళ్యాణ్‌ను ఉద్దేశించి జగన్ ఎద్దేవా చేశారు. మంచి జరుగుతుంటే జీర్ణించుకోలేని పరిస్థితి రాష్ట్రంలో కనిపిస్తోందన్నారు. మహిళలను చంద్రబాబు ప్రభుత్వం నట్టేట ముంచిందని, సున్నా వడ్డీ పథకాన్ని రద్దు చేసిందని ఆరోపించారు. మహిళలకు రూ.3,036 కోట్లు ఇస్తామని ఎగనామం పెట్టిందని జగన్ ఎద్దేవా చేశారు. తమ ప్రభుత్వం సున్నా వడ్డీ పథకం కింద తొలి ఏడాది రూ.1258 కోట్లు, రెండో ఏడాది రూ.1096 కోట్లు, మూడో ఏడాది రూ.1261 కోట్లు చెల్లించామని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తోన్న సంక్షేమ పథకాలలో భాగంగా నేడు పొదుపు సంఘాల మహిళలకు సున్నా వడ్డీ పథకం కింద జగన్ సర్కార్ వడ్డీ సొమ్మును వారి ఖాతాల్లో నగదును జమ చేసింది. ఈ సందర్భంగా బహిరంగ సభలో సీఎం జగన్ మాట్లాడుతూ.. వైయస్ఆర్ సున్నా వడ్డీ రుణాల పథకాన్ని మూడేళ్ళుగా అమలు చేస్తున్నామని చెప్పారు. మూడో విడత చెల్లించాల్సిన 1261 కోటి రూపాయలు నేరుగా మహిళల ఎకౌంట్లలోకి వేస్తున్నామని అన్నారు. మొదటి ఏడాది 2020 ఏప్రిల్ లో సున్నా వడ్డీ కింద రూ.1258 కోట్లు చెల్లించామని.. రెండో ఏడాది 2021 ఏప్రిల్‌లో సున్నా వడ్డీ కింద రూ.1096 కోట్లు చెల్లించామని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ఇలా పొదుపు సంఘాల మహిళలకు వడ్డీ సొమ్ము జమ చేయడం వలన సుమారు 1కోటి, 2 లక్షల 16 వేల 410 మంది మహిళలకు నేరుగా మేలు జరుగుతుందని చెప్పారు. ప్రభుత్వం అక్కచెల్లెమ్మల మంచిని కోరలేదని.. అందుకనే సున్నా వడ్డీ పథకాన్ని చేసిందని అన్నారు. 2016 నుంచి చంద్రబాబు ప్రభుత్వం సున్నావడ్డీ పథకం రద్దు చేశారని.. దీంతో ఆ ఏడాది మహిళలకు 3036 కోట్ల రూపాయలు నష్టం వాటిల్లిందని చెప్పారు. ఈ విలువ 2019 నాటికి 25517 కోట్లకు నష్టం చేరింది. అంతేకాదు మహిళలు సుమారు 12శాతం దాకా వడ్డీలు కట్టాల్సి వచ్చేది. దీంతో 18.36 శాతం డ్వాక్రా సంఘాలు నిర్వీర్యం అయ్యాయి. కానీ మన ప్రభుత్వంలో ప్రతి ఏడాది మహిళలకు భరోసా ఇస్తున్నాం.. దీంతో నేడు నిర్వీర్యం అయిన డ్వాక్రా సంఘాలను 0.73శాతానికి తీసుకొచ్చామని చెప్పారు. వైసీపీ ప్రభుతం అధికారంలోకి వచ్చిన సమయంలో రాష్ట్ర వ్యాప్తంగా 80 లక్షలు డ్వాక్రా సంఘాలు ఉంటే నేడు 1.02 కోట్లకు చేరాయని .. ఇది చరిత్రలో గొప్పగా నిలిచిపోయే గొప్ప విజయమని సీఎం జగన్ అభివర్ణించారు. ఇక పేదలకు సంక్షేమ పథకాలు అమలు చేయడానికి వీల్లేదట.. రోజూ పేపర్లు, టివిల్లో డిబేట్లు పెట్టి ప్రచారం చేస్తున్నారు.. టిడిపి ఏం చెప్పాలనుకుంటుందో.. దానిని వారి పత్రికలు, టివిల ద్వారా చెప్పిస్తున్నారు. అసలు ఈ వాదన అర్థం ఏమిటంటూ ప్రశ్నించారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ పేదలకు అందుతున్న పథకాలను అన్నీ ఆపేయాలని ఆ ఎల్లో పార్టీ, ఎల్లో మీడియా, ఒక ఎల్లో దత్తపుత్రుడు కోరుకుంటున్నారని తీవ్ర విమర్శలు చేశారు. ఇలా సంక్షేమ అమలు చేస్తే రాష్ట్రం శ్రీలంక అయిపోతుందని గోబెల్స్ ప్రచారం చేస్తున్నారంటూ సీఎం జగన్ మండిపడ్డారు. పేదలకు పథకాలు అందితే రాష్ట్రం శ్రీలంక అవుతుందా.. అని ప్రశ్నించారు. ఈ పథకాలు ఆపేస్తే, ఆ డబ్బులు వీరి ఖాతాల్లోకి వెళితే రాష్ట్రం అమెరికా అవుతుందట? ఇలాంటి రాక్షసులతో, దుర్మార్గులతో మనం యుద్ధం చేస్తున్నామని అన్నారు సీఎం జగన్

## భారత్‌లో నేరాలు చేసి వచ్చేవారి బ్రిటన్ సహించదు : బోరిస్ జాన్సన్




న్యూఢిల్లీ : బ్రిటన్ గడ్డపై ఉంటూ, ఇతర దేశాలను బెదిరించే ఉగ్రవాద సంస్థలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించరాదనేది తమ బలమైన దృక్పథమని ఆ దేశ ప్రధాన మంత్రి బోరిస్ జాన్సన్ చెప్పారు. శుక్రవారం ఆయన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో కలిసి హైదరాబాద్ హౌస్‌లో సంయుక్త మీడియా సమావేశంలో మాట్లాడారుఆర్థిక నేరగాళ్ళు విజయ్ మాల్యా, నీరవ్ మోదీ, ఖలిస్థానీ ఉగ్రవాదులను భారత దేశానికి అప్పగించడం గురించి మీడియా అడిగిన ప్రశ్నకు జాన్సన్ సమాధానం చెప్తూ, భారత దేశాన్ని, ఇతర దేశాలను బెదిరించే ఉగ్రవాద సంస్థల పట్ల తమకు బలమైన దృక్పథం ఉందని చెప్పారు. భారత దేశానికి సహాయపడేందుకు తాము యాంటీ ఎక్స్‌ట్రీమిస్ట్ టాస్క్ ఫోర్స్‌ను ఏర్పాటు చేశామన్నారు. భారత దేశం నుంచి పారిపోయి బ్రిటన్‌లో ఉంటున్న ఆర్థిక నేరగాళ్ళను తిరిగి స్వదేశానికి అప్పగించడం గురించి మాట్లాడుతూ, చట్టపరమైన సాంకేతిక అంశాలు ఇమిడియున్నందువల్ల వీరిని తిరిగి అప్పగించడం సంక్లిష్టమవుతోందని చెప్పారు. వారిని తిరిగి పంపిచేయాలని బ్రిటన్ ప్రభుత్వం ఆదేశించిందన్నారు. భారత దేశంలోని చట్టాన్ని తప్పించుకోవడం కోసం బ్రిటన్‌లోని న్యాయ వ్యవస్థను ఉపయోగించుకోవాలనుకునేవారిని తాము స్వాగతించబోమని చెప్పారు. భారత టీకా బాగా పని చేసింది "నా చేతికి భారత కోవిడ్-19 టీకా వేయించుకున్నాను. అది నాకు మేలు చేసింది. భారత దేశానికి చాలా ధన్యవాదాలు" అని బోరిస్ జాన్సన్ చెప్పారు. భారత్-బ్రిటన్ కోవిడ్ టీకా భాగస్వామ్యంభారత్-బ్రిటన్ మధ్య వ్యాక్సిన్ల భాగస్వామ్య ఒప్పందం ఉంది. 2021 మే నెలలో మోదీ, జాన్సన్ మధ్య జరిగిన వర్చువల్ సమావేశంలో ఇరు దేశాలు ఈ భాగస్వామ్యాన్ని మరింత పెంచుకోవడానికి అంగీకరించారు. కోవిడ్ మహమ్మారి నుంచి కోలుకోవడానికి భాగస్వామ్యాన్ని పటిష్టపరచుకోవాలని నిర్ణయించారు.

## 2-12 ఏళ్ల పిల్లలకు కోవాగ్జిన్.. మరింత డేటా కోరిన డీసీజీఐ

న్యూఢిల్లీ: రెండేళ్ల నుంచి 12 ఏళ్ల మధ్య వయసు ఉన్న పిల్లలకు కోవాగ్జిన్ టీకా ఇచ్చే అంశంలో.. ఆ టీకాకు సంబంధించిన మరింత డేటా కావాలని భారత్ బయోటెక్ సంస్థను డీసీజీఐ నిపుణుల కమిటీ కోరినట్లు తెలుస్తోంది. 2 నుంచి 12 ఏళ్ల పిల్లలకు నియంత్రిత పద్ధతిలో వ్యాక్సిన్ ఇవ్వాలని నిపుణుల కమిటీ ప్రతిపాదనలు చేసినట్లు వస్తున్న వార్తల నేపథ్యంలో ఈ విషయం తెలిసింది. 5 నుంచి 12 ఏళ్ల మధ్య వయసున్న పిల్లలపై బయోలాజికల్ ఈ సంస్థకు చెందిన కోర్బీవ్యాక్స్ టీకా అత్యవసర వినియోగంపై




గురువారం ఆంక్షలు విధించారు. అయితే ఇప్పుడు డీసీజీఐ ఆ టీకాకు అత్యవసర వినియోగం కింద అనుమతి దక్కినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం 12 నుంచి 14 ఏళ్ల మధ్య పిల్లలకు కోర్బీవ్యాక్స్ టీకాను ఇస్తున్న సంగతి తెలిసిందే. 12 ఏళ్ల లోపు పిల్లలకు ఇండియాలో రెండు కోవిడ్ టీకాలు అందుబాటులో ఉన్నాయి.

## దేశంలో కొత్తగా 2451 కరోనా కేసులు

న్యూఢిల్లీ: దేశంలో రోజువారీ కరోనా కేసులు స్వల్పంగా పెరిగాయి. కొత్తగా మరో 2451 మంది కరోనా బారినపడ్డారు. దీంతో మొత్తం కేసులు 4,30,52,425కు చేరాయి. ఇందులో 4,25,16,068 మంది బాధితులు కరోనా నుంచి కోలుకున్నారు. మరో 5,22,116 మంది మృతిచెందగా, 14,241 కేసులు యాక్టివ్‌గా ఉన్నాయి. గత 24 గంటల్లో 54 మంది వైరస్‌కు బలవగా, 1589 మంది మహమ్మారి నుంచి బయటపడ్డారు. ఇక మొత్తం కేసుల్లో 0.03 శాతం కేసులు మాత్రమే యాక్టివ్‌గా ఉన్నాయని కేంద్ర ఆరోగ్యశాఖ వెల్లడించింది. ఇప్పటివరకు 98.75 శాతం మంది కోలుకోగా, 1.21 శాతం మంది మృతిచెందారని తెలిపింది. దేశవ్యాప్తంగా 1,87,26,26,515 వ్యాక్సిన్ డోసులను పంపిణీ చేశామని, నిన్న ఒక్కరోజే 18,03,558 మందికి వ్యాక్సినేషన్ చేశామని పేర్కొన్నది.



## అక్కచెల్లెమ్మలకు మంచి జరగాలన్న ఆలోచనే బాబుకు లేదు: సీఎం జగన్



ఒంగోలు: గడిచిన మూడేళ్లలో మొత్తం రూ.3,165 కోట్లు అక్కాచెల్లెమ్మలకు అందజేశామని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. ఒంగోలు బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ ముందుగా సాధికారత సారధులకు అభినందనలు తెలియజేశారు. తొలి ఏడాది సున్నా వడ్డీ కింద ప్రభుత్వం రూ.1,258 కోట్లు చెల్లించిందని, రెండో ఏడాది రూ.1,096 కోట్లు, వరుసగా ఇప్పుడు మూడో ఏడాది రూ. 1,261 కోట్లు చెల్లిస్తున్నట్లు సీఎం జగన్ తెలియజేశారు. వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం ద్వారా దాదాపు కోటి 2లక్షల 16 వేలమందికి పైగా అక్క చెల్లెమ్మలకు మేలు కలిగిందని తెలియజేశారాయన. "గతంలో 12శాతం దాకా వడ్డీలు కట్టాల్సి వచ్చేది. అక్కచెల్లెమ్మలకు మంచి జరగాలన్న ఆలోచనే గత ప్రభుత్వం చేయలేదు. పైగా సున్నా వడ్డీ పథకాన్ని గత ప్రభుత్వం రద్దు చేసిన పరిస్థితులున్నాయి. కానీ మన ప్రభుత్వంలో ప్రతి ఏడాది మహిళలకు భరోసా ఇస్తున్నాం" అని సీఎం జగన్ పేర్కొన్నారు. సంక్షేమ పథకాల ద్వారా 35 నెలల కాలంలో 1,36,694 కోట్లు లబ్ధిదారులకు అందించామని ఆయన పేర్కొన్నారు. ఎక్కడా లంచాలకు తావులేకుండా లబ్ధిదారులకు మేలు జరిగిందని ప్రస్తావించారు. అంతేకాదు.. సామాజిక న్యాయం అన్నది మాటల్లో కాదు.. చేతల్లో చూపించిన ప్రభుత్వం తమదని, మంత్రి పదవులు 70 శాతం దాకా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఇచ్చామని సీఎం వైఎస్ జగన్ గుర్తు చేశారు. ప్రసంగం అనంతరం.. స్వయం సహాయక సంఘాల్లోని మహిళలు బ్యాంకుల్లో తీసుకున్న రుణానికి సంబంధించిన వడ్డీని వరుసగా మూడో ఏడాది వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం లబ్ధిదారుల ఖాతాల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి జమచేశారు.

## ప్రభుత్వ ఉద్యోగుల బదిలీ తీరు పై మండిపడ్డ హైకోర్టు

అమరావతి ఏప్రిల్ 22 ఉద్యోగుల బదిలీకి సంబంధించి ప్రభుత్వ తీరు పై ఏపి హైకోర్టు మండిపడింది. తమకు తెలీకుండా హైకోర్టులో పనిచేస్తున్న ఉద్యోగులను ప్రభుత్వం ఎలా బదిలీ చేస్తుందని చీఫ్ జస్టిస్ ప్రశాంత్ మిశ్రా ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. కొంతకాలంగా ఏదో విషయంలో ఇటు ప్రభుత్వానికి అటు హైకోర్టుకు మధ్య వివాదాలు నడుస్తూనే ఉన్నాయి. హైకోర్టులో డిప్యుటేషన్ పై పనిచేస్తున్న ఏపీ పరిపాలనా ట్రైబ్యునల్ ఉద్యోగులను ప్రభుత్వం బదిలీ చేసింది. ఇక్కడే ప్రభుత్వం పై ప్రధాన న్యాయమూర్తి మండిపోయారు. విషయం ఏమిటంటే హైకోర్టులో ఉద్యోగాల కొరత తీవ్రంగా ఉంది. అందుకనే ఆంధ్రప్రదేశ్ అడ్మినిస్ట్రేషన్ ట్రైబ్యునల్ ను రద్దు చేసిన తర్వాత అందులో ఉన్న ఉద్యోగులందరినీ ప్రభుత్వం హైకోర్టుకు డిప్యుటేషన్ మీద బదిలీ చేసింది. ఇపుడు మళ్ళీ డిప్యుటేషన్ పై పనిచేస్తున్న 70 మంది ఉద్యోగుల డిప్యుటేషన్ రద్దుచేసి హైకోర్టు నుండి బదిలీ చేయాలని ప్రక్రియ మొదలు పెట్టింది. దీన్ని హైకోర్టు లాయర్ గూడపాటి లక్ష్మీనారాయణ సవాల్ చేస్తూ హైకోర్టులో ప్రజా ప్రయోజన లిటిగేషన్ (పిల్)దాఖలు చేశారు. ఈ పిల్ ను విచారించిన సందర్భంగానే ప్రభుత్వం తీరుపై హైకోర్టు చీఫ్ జస్టిస్



మండిపోయారు. హైకోర్టు సామర్ధ్యానికి తగ్గట్లుగా ఉద్యోగులు లేక అవస్థలు పడుతుంటే డిప్యుటేషన్ పై ఉన్న ఉద్యోగులను కూడా మళ్ళీ బదిలీ చేయడం ఏమిటంటు నిలదీసింది. ఏపీ హైకోర్టుకు మంజూరైన పోస్టులు 990 అయితే ఇపుడు పనిచేస్తున్నది కేవలం 365 మంది మాత్రమే అని చెప్పారు. అలాంటిది డిప్యుటేషన్ పై వచ్చిన ఉద్యోగులను బదిలీ చేస్తే ఎదురయ్యే సమస్యలను తెలుసుకోకుండా ఏకపక్షంగా బదిలీ చేయడం ఏమిటని నిలదీసింది. హైకోర్టులో డిప్యుటేషన్ పై పనిచేస్తున్న ఉద్యోగులను బదిలీచేయాలని ప్రభుత్వం అనుకున్నపుడు ముందుగా తమతో సంప్రదించచుండా ఎలా నిర్ణయం తీసుకుంటారని ప్రశ్నించారు. పూర్తిస్థామర్థ్యానికి గాను హైకోర్టు 40 శాతం సిబ్బందితోనే పనిచేస్తున్న విషయం ప్రభుత్వానికి తెలుసా ? అంటు అడిగారు. ఈ విషయమై అడ్వకేట్ జనరల్ మాట్లాడుతు బదిలీ ప్రక్రియ విషయంలో గతంలోనే హైకోర్టు రిజిస్ట్రీని లేఖ ద్వారా సంప్రదించినట్లు చెప్పారు. అయితే అడ్వకేట్ జనరల్ వాదనను హైకోర్టు పట్టించుకోలేదు. మొత్తం మీద బదిలీ ప్రక్రియను హైకోర్టు నిలిపేసింది.

## సీఎం జగన్ పాలనలో ఆడబిడ్డలకు రక్షణ కరువైంది: చంద్రబాబు

విజయవాడ: ప్రభుత్వ ఆస్పత్రిలో అత్యాచారానికి గురై చికిత్స పొందుతున్న బాధితురాలిని టీడీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పరామర్శించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బాధిత కుటుంబానికి రూ.5 లక్షల



ఆర్థికసాయం ప్రకటించారు. సీఎం జగన్ పాలనలో ఆడబిడ్డలకు రక్షణ కరువైందని, బాధ్యత లేకుండా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. సీఎం కనీసం బాధితురాలిని పరామర్శించలేదని విమర్శించారు. ఆడబిడ్డలపై అఘాయిత్యాలు జరుగుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. రాష్ట్రాన్ని పరిపాలించే అర్హత వైసీపీ ప్రభుత్వానికి లేదని చంద్రబాబు అన్నారు. ఒంగోలులో ప్రయాణికుల పట్ల పోలీసుల తీరును ఖండిస్తున్నామన్నారు. ప్రజల ఆస్తులకు, మహిళలకు ఏపీలో రక్షణ లేదన్నారు. బాధితురాలి తండ్రి ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ చర్యలతో సంఘ విద్రోహ శక్తులు రెచ్చిపోతున్నారన్నారు. ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేసి నిందితులకు ఉరిశిక్ష వేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం బాధితురాలికి రూ.కోటి ఆర్థికసాయం చేసి, ఉద్యోగం ఇచ్చి ఆదుకోవాలన్నారు. అత్యాచార బాధితురాలికి న్యాయం జరిగేవరకు పోరాడుతామని స్పష్టం చేశారు. ఈ ఘటనలో పోలీసుల వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోందని చంద్రబాబు అన్నారు.

## విజయవాడ ఆస్పత్రి ఘటన..

**బాధిత కుటుంబానికి రూ.10లక్షల పరిహారం**

అమరావతి: విజయవాడ ఆస్పత్రిలో మానసిక వికలాంగురాలిపై అత్యాచార ఘటన వ్యవహారంలో కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలు జారీచేశారు. ఎవరి నిర్లక్ష్యం ఉన్నా ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించవద్దని, బాధ్యులపై గట్టి చర్యలు తీసుకోవాలన్నారు. ఈమేరకు సీఎంఓ అధికారులకు ఆదేశాలిచ్చారు. బాధిత కుటుంబానికి అండగా నిలవాలని, ఆ కుటుంబానికి కూ.10 లక్షల పరిహారం వెంటనే ఇవ్వాలన్నారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు విధుల్లో నిర్లక్ష్యం వహించారనే కారణాలపై ఒక సీఐ, ఎస్సైలను సస్పెండ్ చేశారు. ఈ ఘటనపై వైద్య ఆరోగ్యశాఖ కూడా చర్యలు ప్రారంభించింది. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు విజయవాడ ఆస్పత్రి సిబ్బందిపై చర్యలు తీసుకున్నారు. నిందితులు ఫాగింగ్ ఏజెన్సీకి చెందిన కార్మికులుగా గుర్తించి.. వారిని విధులనుంచి తొలగిస్తున్నట్టుగా ఉత్తర్వులు జారీ చేశారు.

# సంపాదకీయం

శనివారం ,23-04-2022

## అవినీతి అంతం..నినాదమేనా

దేశంలో అవినీతి పెరిగి పోయింది. ఇది దశాబ్దాలుగా వింటున్న మాట. మరో వంక అవినీతిని అంత మొందిస్తామనే రాజకీయ పార్టీల ఎన్నికల వాగ్దానాలకు కొదవ లేదు. నిజానికి, 2014 ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి తెచ్చిన ప్రధాన ఎన్నికల వాగ్దానం కూడా అదే. అయితే, ఆ తర్వాత ఏమి జరిగిందో, ఏమి జరుగుతోందో చూస్తూనే ఉన్నాం. నిజమే,మోడీ ప్రభుత్వం అవినీతిని నిరోధించేందుకు కొన్ని చర్యలు తీసుకుంది. అలాగే,గతంలోనూ ప్రభుత్వాలు అవినీతిని అదుపు చేసేందుకు కొన్ని చర్యలు తీసుకున్నాయి, చట్టాలు తెచ్చాయి. అయినా శతకోటి దరిద్రాలకు అనంతకోటి ఉపాయాలు అన్నట్లుగా, ఏ పార్టీ అధికారంలో ఉన్నా, ప్రభుత్వాలు ఎవైనా, అయినా, అవినీతి పెరిగింది. పెరుగుతోందే కానీ, తగ్గిన దాఖలాలు అంతగా లేవు. చట్టం తనపని తానూ చేసుకు పోతోంది అయినా, అవినీతి వ్యవస్థీకృతం అయిందనే అభియోగాలు వినిపిస్తున్నాయి. నిన్నమొన్ననే, కర్ణాటకలో మంత్రి ఈశ్వరప్ప, ప్రభుత్వ పనులు చేసిన కాంట్రాక్టర్ల నుంచి 40 పెర్సెంట్ డిమాండ్ చేస్తున్నారనే అభియోగం పై మంత్రి పదవికి రాజీనామా చేశారు. ఇదొకటి తాజాగా వెలుగు చూసిన ఉదంతం అయితే, వెలుగు చూడని కథలు ఎన్నున్నాయో .. ఎవరికీ తెలియదు..కేంద్ర ప్రభుత్వం రాజకీయ, ప్రభుత్వ యంత్రాంగ అవినీతిని, అదుపు చేసేందుకు స్థిరాస్తులు అన్నింటినీ ఆధార్'తో అనుసంధానం చేయాలనే ప్రతిపాదనను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. ఇందుకు సంబంధించి సుప్రీం కోర్టు అభిప్రాయం కోరిన కేంద్ర ప్రభుత్వం, సర్వోన్నత న్యాయస్థానం నిర్ణయం రాగానే, అడుగు ముందుకేస్తుందని అధికార వర్గాల సమాచారం. నిజంగా, ఇది నిజమే అయితే, ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ప్రభుత్వం అలాంటి సాహసోపేతమైన నిర్ణయమే తీసుకుంటే, అది నిస్సందేహంగా అవినీతి అంతం దిశగా తీసుకునే, చాలా చాలా గొప్ప ముందడుగు అవుతుందని, అంటున్నారు.అవినీతికి అలవాటు పడిన రాజకీయ బేహారులు, ప్రభుత్వ అధికారులు, వ్యాపారవేత్తలు తమ అక్రమ సంపదనను, చాలా వరకు ఇంటి పని వారు, డ్రైవర్లు, బంధువులు, బామ్మర్దులు ఇతర బినామీల పేరున భూములు,ఇళ్లు, విల్లాలు వంటి ఇతర స్థిరాస్తులు కొని, చట్టానికి చిక్కకుండా తప్పించుకుంటున్నారు. అందుకే ఈ బినామీ వ్యవహారాలకు చెక్ పెట్టేందుకు, వ్యక్తుల స్థిరాస్తుల వివరాలను ఆధార్'కు అనుసంధానం చేయాలనే ప్రతిపాదన వచ్చింది. కాగా, కేంద్ర ప్రభుత్వం ఈ ప్రతిపాదన అమలు చేసేందుకు సిద్దంగా ఉందని అంటున్నారు. ఆధార్ ఇప్పటికే పాన్ తో అనుసంధానం అయినందున, వ్యక్తుల స్థిరాస్థులను ఆధార్'తో అనుసంధానం చేస్తే, దొంగ సొమ్ముతో, బినామీ పేర్లతో ఆస్తులు కూడబెట్టిన అక్రమార్కుల చిట్టా దొరికి పోతుందని ప్రభుత్వం భావిస్తోంది. అదే జరిగితే, బినామీల పేరున అక్రమ ఆస్తులు కూడ బెట్టిన అక్రమార్కులు ఫ్లాట్స్,ఇళ్లు, ఇతర స్థిరాస్తులను విక్రయించక తప్పని గత్యంతర పరిస్థితి వస్తుంది. దీంతో ఫ్లాట్స్, ఇళ్ల ధరలు దిగివస్తాయని ప్రభుత్వం ఆశిస్తోంది. అలాగే, ఆస్తులు బినామీ పేర్లతో ఉంటే,ప్రభుత్వం ఆ ఆస్తులను జప్తు చేసి, వేలంలో విక్రయించే అధికారం చిక్కుతుంది. అవిధంగా ప్రభుత్వానికి వేల కోట్ల రుపాయాల ఆదాయం వస్తుంది. అలాగే అక్రమార్కుల గుట్టు రట్టయి శిక్షలు అనుభవించ వలసి వస్తుంది. ఆవిధంగా ఆధార్'తో ఆస్తుల అనుసంధానం వలన కాలక్రమంలో అవినీతి అంతరించి పోతుందని, ప్రభుత్వం ఆశిస్తోంది. అయితే, అది అంత సులభమా అంటే, కాదనే అంటున్నారు.

# అనంతలో కుమ్ములాటలకు ఫుల్ స్టాప్ ఎప్పుడు

అనంతపురం, ఏప్రిల్ 22,మంత్రి పదవి చేతి దాక వచ్చి.. అందకుండా పోయింది. కానీ పార్టీ అధిష్టానం వారిని శాంతింపజేయాలనో లేక.. వారు సమర్థులనో తెలియదు కానీ.. వారికి అధ్యక్ష బాధ్యతలు అప్పజెప్పారు. రెండు జిల్లాలకు వేర్వేరుగా అధ్యక్షులైన ఈ ఇద్దరు ఎమ్మెల్యేలు పార్టీని సమర్థవంతంగా నడిపిస్తారా? వారికి జిల్లా నేతలు సహకరిస్తారా? వారి బలం ఏంటి? లోపాలు ఏంటి? ఇన్ ఛార్జి మంత్రుల ప్రభావం ఆ జిల్లాపై ఎంత వరకు ఉండబోతోంది? మారిన అనంత వైసీపీ రాజకీయలపై ప్రత్యేక కథనం..తినేందుకు భోజనం లేదంటే.. గంజి నీళ్లతో సరిపెట్టోమంటారు.. కానీ రాజకీయాల్లో అలాంటి కుదరవు.. తమకు దక్కాల్సిన పదవులు దక్కకపోతే రాజీ పడేదిలేదంటారు నేతలు. ప్రస్తుతం వైసీపీలో ఇలాంటి పరిస్థితే కనిపిస్తోంది. నిన్నటి వరకు మంత్రి పదవి వస్తుందని.. ఉన్న మంత్రి పదవి ఫదిలంగా ఉంటుందని ఆశించిన ఆ నేతలకు మంత్రి వర్గ పునర్వ్యవస్థీకరణతో షాక్ తగిలింది. అయితే మంత్రి పదవి రాలేదన్న అసంతృప్తికి విరుగుడుగా.. పార్టీ బాధ్యతలు ఇస్తామని సీఎం జగన్ ముందే చెప్పారు. ఈనేపథ్యంలో కొత్తగా ఏర్పడిన జిల్లాలతో సహా అన్ని చోట్లా అధ్యక్షులను నియమించారు. మంత్రి బాధ్యతలు అధికారికంగా మాత్రమే ఉంటాయని.. పార్టీ బాధ్యతలే చాల కీలకమని.. రాబోయే ఎన్నికల్లో పార్టీని గెలిపించే బాధ్యతతో పాటు ఎవరి పని తీరు ఏంటో తెలిపే కీలకమైన పగ్గాలను మీచేతుల్లోకి అందిస్తున్నామని అధిష్టానం స్పష్టంగా తెలియజేసింది. అయితే ఈ నిర్ణయాలు పార్టీకి మంచి చేస్తాయా లేక మొదటికే మోసం చేస్తాయా అంటే.. ఉమ్మడి అనంతపై సీఎం జగన్ తీసుకున్న నిర్ణయం మంచే చేస్తుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.దీనికి కారణం ఆయన ఎంచుకున్న అధ్యక్షులే. అనంతపురం జిల్లా అధ్యక్షుడిగా కాపు రామచంద్రారెడ్డిని, శ్రీ సత్యసాయి జిల్లా అధ్యక్షుడిగా మాజీ మంత్రి శంకరనారాయణను నియమించారు. ప్రస్తుతం ఈ ఇద్దరు నేతలే ఉమ్మడి అనంతపురం జిల్లాలో అత్యధిక సీట్లను గెలిపించే బాధ్యతను తీసుకోబోతున్నారు. అయితే చాలా జిల్లాల్లో అధ్యక్షులతో విబేధాలు ఉంటాయి. కానీ ఇక్కడ మాత్రం అలాంటివి ఏవి కనిపించవనే చెప్పాలి. ఎందుకంటే ఈ ఇద్దరు నేతలు అజాత శత్రువులనే చెప్పాలి. కాపు రామచంద్రారెడ్డి విషయానికొస్తే.. ఆయన వైఎస్ కుటుంబానికి మొదటి నుంచి విధేయులు. సీఎం జగన్ పార్టీ పెట్టిన తొలినాళ్లలో ఎమ్మెల్యే పదవి త్యజించి వచ్చారు. అయితే మంత్రి పదవి రాలేదని రెండు సార్లు నిరాశలో ఉన్నారు. కానీ ఎక్కడా ఆయన పార్టీ గురించి కానీ, జగన్ గురించి ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదు. తన జిల్లా పరిధిలోని మొత్తం ఏడు నియోజకవర్గాల్లో ఆయన్ను వ్యతిరేకించే వారు లేరు. అందరు ఎమ్మెల్యేలతోనూ సఖ్యతగా ఉంటారు. కాకపోతే కాపులకు ఏదైనా సమస్య వస్తే.. కొత్తగా వచ్చిన మంత్రి ఉషాశ్రీ చరణ్ నుంచే రావాలి. ఒక వైపు ఆమె మంత్రి.. ఇటు వైపు ఆయన అధ్యక్షులు ఈ రెండింటినీ ఇద్దరూ అర్థం చేసుకుంటే.. అనంతపురం జిల్లా వరకు పార్టీలో ఎలాంటి విబేధాలు కనిపించే అవకాశం లేదని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.ఇక శంకర్ నారాయణ విషయానికొస్తే.. ఆయనకు తొలిసారే పిలిచి మరీ మంత్రి పదవి ఇచ్చారు. రెండవ సారి ఇస్తారని ఆశించినా అది దక్కలేదు. ఈ నేపథ్యంలోనే కొత్త జిల్లా అయిన శ్రీ సత్యసాయి జిల్లా బాధ్యతలు అప్పజెప్పారు. ఇక్కడ ఒక విషయం ఏంటంటే.. శంకర్ నారాయణ మొదటి నుంచి సౌమ్యుడు జిల్లాలో ఏ ఒక్కరితోనూ విబేధాలు లేవు. గత కొన్నేళ్లుగా ఆయనే ఉమ్మడి జిల్లాకు పార్టీ అధ్యక్షుడిగా ఉన్నారు. ఎక్కడా చిన్న కంప్లైంట్ లేదు. ఈనేపథ్యంలో ఇక్కడ కూడా పెద్దగా సమస్యలు వచ్చే అవకాశం లేదు. ఇకపోతే.. జిల్లా ఇన్ ఛార్జ్ మంత్రుల విషయానికొస్తే.. రాష్ట్ర విద్యుత్తు, అటవీ–పర్యావరణ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని అనంతపురం జిల్లా ఇన్ఛార్జి మంత్రిగా, రాష్ట్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి గుమ్మనూరు జయరాంను శ్రీసత్యసాయి జిల్లా ఇన్ఛార్జి మంత్రిగా నియమించారు.

ఈ పదవులు మాత్రం కత్తి మీద సామేనని చెప్పాలి. అనంతలో ఎక్కడా విబేధాలు రావు కానీ నీటి పంపకాల విషయానికొస్తే మాత్రం ఆస్తి వివాదాలున్నంత ఫైటింగ్ కనిపిస్తుంది. అందునా ఇప్పుడు జిల్లాల విభజన జరిగింది. మరి దీనిని ఎలా పరిష్కరిస్తారన్నది చూడాలి.మరోవైపు చిత్తూరు, శ్రీసత్యసాయి, అన్నమయ్య, అనంతపురం జిల్లాల సమన్వయకర్తగా, రీజినల్ కో ఆర్డినేటర్గా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని నియమించారు. ఇక్కడ ఏ సమస్య ఉండదనే చెప్పాలి. మంత్రి పెద్దిరెడ్డిని రెండు జిల్లాల నేతలు ఎంతో గౌరవిస్తారు. మొత్తం మీద సీఎం జగన్ పార్టీ పరంగా, ప్రభుత్వ పరంగా తీసుకున్న నిర్ణయం అనంతపురం జిల్లాపై పాజిటీవ్ వైబ్రేషన్సే కనిపిస్తున్నాయి.

# శ్రీశైలం డ్యామ్ కు ముప్పు



కర్నూలు, ఏప్రిల్ 22, దేశంలోని అతి ముఖ్యమైన రిజర్వాయర్లలో ఒకటేనా శ్రీశైలం డ్యామ్ కు ముప్పు పొంచి ఉన్నట్లు కేంద్ర జల సంఘం మాజీ చైర్మన్ ఏః పాండ్యా కమిటీ హెచ్చరించింది. ఎందుకు ముప్పు పొంచి ఉంది, వాటికి పరిష్కారాలను కూడా కమిటీ సూచించింది. సూచనలు అమలు చేయకపోతే డ్యామ్ కు ప్రమాదం ఉందని హెచ్చరించింది.. కాగా.. శ్రీశైలం డ్యామ్ భద్రతపై ఇప్పటికే అనేక కమిటీలు ఏర్పాటు అయ్యాయి. సూచనలు సలహాలు కూడా ఇచ్చాయి. అయితే 2020 ఫిబ్రవరి లో ఏర్పాటైన కేంద్ర జలసంఘం మాజీ చైర్మన్ ఏ బి పాండ్య కమిటీ అతి కీలకమైనది. ఈ కమిటీ డ్యామ్ పరిశీలించి లోతైన తుది నివేదికను అందజేసింది. కమిటీ చైర్మన్ పాండియా ఇచ్చిన నివేదికలో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. డ్యాం ప్రస్తుతం ఉన్న స్పిల్ వే సామర్థ్యానికి తగ్గట్టుగా లేదని దీంతో ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉందని హెచ్చరించింది. దీనికి పలు కారణాలను , పరిష్కారాలను కూడా కమిటీ సూచించింది.

ప్రమాదం ఎందుకు ఉంది అంటే..

× శ్రీశైలం డ్యామ్ కు అంచనాలకు మించి గరిష్టంగా 26 లక్షల క్యూసెక్కుల వరద నీరు డ్యామ్ కు వచ్చే అవకాశం ఉంది.

× ప్రస్తుత డ్యామ్ స్పిల్ వే సామర్థ్యం కేవలం 13.2 లక్షల క్యూసెక్కులు మాత్రమే.

× ఇంకా ఎక్కువ తీసుకుంటే 14.55 లక్షల క్యూసెక్కులకు మించదు.

2009లో లో ఏకంగా 25.5 లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహం శ్రీశైలం డ్యామ్ ను తాకింది. అప్పట్లోనే స్పిల్వే పైన వరద నీరు ప్రవహించింది. ఇంత భారీ వరద వస్తే అన్ని గేట్లు ఎత్తి 14.8 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు వదల గలిగారు. దీంతో డ్యాంకు గరిష్ట వరద నీటి కి తగ్గట్లుగా స్పిల్వే సామర్థ్యం లేదని ఋజువైంది. ఇదే విషయాన్ని పాండియా కమిటీ ఆధారాలతో సహా నిరూపించి నివేదిక పంపింది.డ్యామ్ కు ప్రధాన ముప్పు స్పిల్ వే సామర్థ్యం తక్కువగా ఉండటమే కారణమని చెప్తూనే మరికొన్ని కారణాలు కూడా డ్యామ్ కు ప్రమాదంగా ఉన్నాయని సూచించింది. స్పిల్ వే గేట్ల నుంచి నీళ్లు కిందపడి మళ్లీ ఎగిరే ప్రాంతం ప్లంజ్ పూల్ లో ఏర్పడిన భారీ గొయ్యి డ్యామ్ కు ప్రమాదంగా ఉన్నట్లు హెచ్చరించింది.. ఈ గొయ్యి పూడ్చివేత కు తక్షణమే చర్యలు చేపట్టాలని హెచ్చరించింది. ప్లంజ పూల్ కు ఉన్న కుడి ఎడమ గట్లను తదుపరి నష్టం రాకుండా కార్యాచరణ చేపట్టాలి. రివర్స్ స్లూయిస్ గేట్లు అత్యవసర సమయంలో సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నందున దృష్టి సారించాలి ఇప్పుడే.. అని పాండ్యా కమిటీ హెచ్చరించింది.ప్రమాదం జరగకుండా పరిష్కార మార్గాలను కూడా పాండ్యా కమిటీ పలు సూచనలు చేసింది.

గరిష్ట వరద ప్రవాహానికి స్పిల్ వే సామర్థ్యం తక్కువగా ఉన్నందున డ్యామ్ కు ఎగువ భాగంలో ఐదు కిలోమీటర్ల దగ్గర మరో స్పిల్వే నిర్మించాలి.

స్పిల్ వే నిర్మిస్తే దానికి బ్రిచింగ్ సెక్షన్ ఉండాలి అంటే అత్యవసరమైతే గండి కొట్టేలా స్పిల్వే నిర్మించాలి.

మరో స్పిల్వే నిర్మించ లేనిపక్షంలో డ్యాం ఎత్తు పెంచాలి.

స్పిల్వే సామర్థ్యానికి మించి వరదలు వస్తే కొంత వరదలు కుడివైపు పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా నీటిని మళ్లించాలి.

ఎడమ వైపున ఎగువ భాగంలో నీటిని మళ్లించడానికి అనువైన ప్రాంతం కూడా ఉంది.

కేంద్ర జల సంఘం, ఐఎండి వద్ద వరదనీటి అంచనాకు అత్యాధునిక వ్యవస్థలు ఉన్నాయి. వీటి ద్వారా పసిగట్టి డియల్ లోని నీటిని ముందుగానే ఖాళీ చేయడం ద్వారా ప్రమాదాన్ని నియంత్రించవచ్చు.

ప్రస్తుత స్పిల్వే కు ఎక్కువ ఎత్తులో గేట్లు ఉండేలా మార్పుచేయడం, స్పిల్ వే క్రస్ట్ లెవెల్ తగ్గించడం పై ఆలోచించాలి. ప్రస్తుత గరిష్ట నీటి నిల్వకు తగ్గట్టుగా డ్యాం ఎత్తు పెంచితే ముంపు ప్రాంతాలను కూడా పరిగణలోకి తీసుకోవాలని ఏః పాండ్య కమిటీ సూచించింది.

డ్యాం కుడి ఎడమ వైపుల నుంచి నీటిని మళ్లించేందుకు ఏర్పాట్లు చేయాలని కమిటీ సిఫారసు చేసింది.కేంద్ర జల సంఘం మాజీ చైర్మన్ పాండ్య తుది నివేదిక ఇచ్చినందున దాని అమలు ఎంతవరకు ఎప్పటిలోగా సాధ్యమవుతుంది అనేది వేచి చూడాలి.

# అప్పుడు పోరాటం.. ఇప్పుడు ప్రారంభం

కాకినాడ, ఏప్రిల్ 22 గత ఎన్నికల ముందు జగన్ ఏం చెప్పారో...అధికారంలోకి వచ్చిన తరువాత అందుకు పూర్తి విరుద్ధంగా చేస్తున్నారు. నాడు అసెంబ్లీ సాక్షిగా అమరావతే రాజధాని అన్నారు. నేడు కోర్టులు మొట్టికాయలు వేసినా మూడు రాజధానులే ముద్దు అంటున్నారు. నాడు పాదయాత్రలో గ్రాసిమ్ రసాయనాల పరిశ్రమను విష పరిశ్రమ అంటూ విమర్శలు గుప్పించారు. ఇప్పుడు ఆ పరిశ్రమ అమృత తుల్యమంటూ ప్రారంభోత్సవానికి హాజౌతున్నారు. నాడు తెలుగుదేశంప్రభుత్వం ఔనన్న ప్రతి దానినీ కాదనమే పనిగా పెట్టుకున్న జగన్ నేడు నాడు వేటినైనా కాదన్నారో వాటినే ఔదాలుస్తూ ముందుకు సాగుతున్నారు. మొత్తానికి జగన్మాయను ఓ రేంజ్ లో ప్రదర్శిస్తున్నారు. ఇక ప్రస్తుతం ఆయన గురువారం ప్రారంభోత్సవం చేయనున్న గ్రాసిమ్ కెమికల్ ఫ్యాక్టరీ ఆదిత్య బిర్లా గ్రూపునకు చెందినది. తూర్పుగోదావరి జిల్లా భలభద్రపురంలో దాదాపు 900 కోట్ల రూపాయలతో నిర్మితమైన ఈ ఫ్యాక్టరీ గురువారం జగన్ చేతుల మీదుగా ప్రారంభం.రాష్ట్రం నుంచి పరిశ్రమలు తరలిపోతున్నాయి, పెట్టుబడులు రావడం లేదు అన్న ఆందోళన వ్యక్తమౌతున్న సమయంలో రూ.900 కోట్ల పెట్టుబడితో పరిశ్రమను ప్రారంభించడం ఎంతైనా ఆహ్వానించదగ్గది. కానీ నాలుగేళ్ల నాడు విపక్ష నేత హోదాలో ఇదే పరిశ్రమపై విషంకక్కి, ప్రజలను రెచ్చగొట్టి ఉద్యమాల బాట పట్టించిన జగన్ ఇప్పుడు అదే పరిశ్రమ ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రి హోదాలో రావడమే వైచిత్రి. నాడు జగన్ పుణ్యమా అని జనం ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా ఆందోళన బాట పట్టారు. కేసుల్లో ఇరుక్కున్నారు. అలా ఇరుక్కున్న వారు దాదాపు 500 మంది ఉన్నారు. ఇప్పటికీ వారిపై కేసులు నడుస్తున్నాయి. నాడు జగన్ పరిశ్రమ అనుమతులు రద్దు చేయాలని అప్పటి చంద్రబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మీరు చేయకపోతే మా ప్రభుత్వం వచ్చాకా ఆ పని చేస్తామని హుంకరించారు. అయితే మాట తప్పి మడమతిప్పి ఇప్పుడు అదే పరిశ్రమ ప్రారంభోత్సవానికి సీఎం హోదాలో వెళుతున్నారు. దీనికి ఆయన ఏ మాత్రం ఇబ్బంది పడటం లేదు. అదీ జగన్ స్టైల్.నాడు జనాల ఉసురు తీయాడానికే గ్రాసిమ్ కెమికల్ ఫ్యాక్టరీ అన్న జగన్ ఇప్పుడు తొలి దశలో ఐదు వేల మందికి ఉపాధి కల్పించే కల్పతరువుగా అదే ఫ్యాక్టరీని అభివర్ణిస్తున్నారు. మరి అప్పటి ఉద్యమాలలో కేసుల్లో ఇరుక్కున్న వారి మాటేమిటంటే నోరు విప్పడం లేదు. అధికారం కోసం కనిపించిన ప్రతి దానినీ ఖండించేసిన ఆయన ఇప్పుడు అధికారంలో ఉండి నాడు వద్దన్న ప్రతి అంశాన్ని అక్కున చేర్చుకుని అందలం ఎక్కిస్తున్నారు. నాడు జనంలో ఉద్రేకతలను రెచ్చగొట్టి వారు కేసుల్లో చిక్కుకుని విలవిలలాడిన సంగతిని ఇప్పుడు పూర్తిగా మర్చిపోయి అక్కడికే అదే పరిశ్రమ ప్రారంభోత్సవానికి కించిత్తైనా వెరవకుండా వెడుతున్నారు. ఆయన నాడు–నేడు కార్యక్రమంలో జగన్ తీరును కూడా చేరిస్తే ఇంకా బాగుంటుంది కదా! జగన్ లో నాటికీ– నేటికీ ఎంత మార్పు అని జనం ఆశ్చర్యపోయేలా జగన్ మేకోవర్ ఉందని పరిశీలకులు అంటున్నారు.

# విజయసాయికి రాజ్యసభ అనుమానమేనా

విజయవాడ, ఏప్రిల్ 22, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డితో,,ఆ పార్టీ రాజ్యసభ సభ్యుడు విజయ సాయి రెడ్డికి ఉన్న సంబంధాల గురించి ప్రత్యేకంగా చెప్పుకోవలసిన అవసరం లేదు. జగన్ రెడ్డి రాజకీయ, వ్యాపార వ్యవహారాలన్నింటిలో విజయ సాయి, నెంబర్ 2గా ఉంటూనే ఉన్నారు.చివరకు అక్రమాస్తుల కేసులో జగన్ రెడ్డి జైలుకు వెళితే,ఆయన వెంట విజయసాయి కూడా జైలుకు వెళ్ళారు. మొత్తం 16 నెలలు ఆయనతో జైలులోనే ఉన్నారు. ఇక వైసీపీ అదికారంలోకి వచ్చిన తర్వాత, అంతకు ముందు కూడా ఢిల్లీలో జగన్ రెడ్డి పనులను విజయసాయి చక్క పెడుతూ వచ్చారు. అలాగే,రాజ్యసభ ఎంపీగా, వైసీపీ పార్లమెంటరీ పార్టీ నాయకుడిగా ప్రభుత్వ కార్యకలాపాలను, కేంద్ర రాష్ట్ర సంబంధాలను కూడా ఆయనే నెత్తికెత్తుకున్నారు..మరో వంక ఉత్తరాంధ్ర వైసీపీ ఇంచార్జిగా, ఆమూడు జిల్లాలకు ఆయనే ముఖ్యమంత్రి అన్నట్లుగా వ్యవహరించారు. అయితే రాజకీయాలలో ఓడలు బండ్లు, బండ్లు ఓడలవుతాయి అన్నట్లుగా, ఇప్పుడు సీన్ రివర్స్ అయిన సంకేతాలు కనిపిస్తున్నాయి. ముఖ్యమంత్రి జగన్ రెడ్డి ఎందుకనో గానీ, విజయసాయి రెడ్డిని పదవుల నుంచి పక్కకు తప్పిస్తున్నారు. ఒకప్పుడు, ప్రస్తుతం సజ్జల నిర్వహిస్తున్న,'ఆల్ ఇన్ వన్' పోజిషన్'లో విజయసాయి ఓ వెలుగు వెలిగారు. ఆ తర్వాత, సజ్జల ఎంట్రీతో జగన్ రెడ్డి, సాయి రెడ్డి మధ్య దూరం పెరిగింది. ఇప్పుడు చివరకు విజయసాయి రాజకీయ భవిష్యత్తే ప్రశ్నార్ధకంగా మారిందంటున్నారు.ఇటీవల జగన్ రెడ్డి చేపట్టిన పార్టీ పక్షాళన కార్యక్రమలో భాగంగా ఉత్తరాంధ్ర ఇంచార్జి (సమన్వయకర్త) బాధ్యతల నుంచి విజయ సాయి రెడ్డినితప్పించారు. వైవీ సుబ్బారెడ్డికి విశాఖ పార్టీ బాధ్యతలు అప్పగించారు. అంతే కాదు, విజయ సాయికి, ఇంకో కీలక బాధ్యత అయినా ఇచ్చారా అంటే అదీ లేదు. ఆయన పదవులు ఒక టొకటిగా, తీసేస్తున్నారు. ఒక విధంగా చూస్తే, జగన్ రెడ్డి ఎందుకనోగానీ,ఒకప్పుడు తమిళనాడు ముఖ్యమంత్రి జయలలిత తమ నెచ్చెలి శశికళను దూరం పెట్టినట్లుగా జగన రెడ్డి విజయ సాయిని దూరం పెడుతున్నారు. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే పొమ్మన కుండా పోగాబెడుతున్నారా అనే అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం విజయసాయి పరిస్థితి ఇంత బతుకూ బతికి.. అన్నట్లుగా పార్టీ అనుబంధ విభాగాల ఇన్ ఛార్జ్' పోస్టుకే పరిమితం అయిందని, పార్టీలో కొందరు



అయ్యో .. అంటున్నారు. ఈ నేపథ్యంలో విజయసాయి రెడ్డికి మరోమారు రాజ్యసభ అవకాశం అయినా ఇస్తారా లేక అక్కడా మొండి చేయి చూపిస్తారా అనే చర్చ వైసీపీ వర్గాల్లో జోరుగా సాగుతోంది. విజయ సాయి రాజ్యసభ పదవీ కాలం ముగింపు దశకు చేరుకుంది. ఆయనతో పాటుగా రాష్ట్రం నుంచి ఇద్దరు టీడీపీ, ఒక బీజేపీ, మొత్తం నలుగురు పెద్దల సభ సభ్యుల పదవీ కాలం త్వరలో ముగియనునుంది. మొత్తం నాలుగు రాజ్యసభ స్థానాలు ఖాళీ కానున్నాయి.ఈసారి నాలుగు స్థానాలు కూడా వైసీపీ గెలుచుకునే అవకాశం వుంది. నిన్న మొన్నటిదాకా అందులో ఒకటి విజయ సాయి రెడ్డికి ఖాయమనే ప్రచారం జరిగింది. జగన్ రెడ్డి, విజయ సాయిని రీ నామినేట్ చేస్తారని భావించారు. అయితే తాజా పరిణామాల నేపథ్యంతో పాటుగా, తెరపైకొస్తున్న కొత్త సామాజిక సమీకరణల నేపథ్యంలో, విజయ సాయికి, పెద్దల సభలో కుర్చీ డౌటే అంటున్నారు. నిజానికి, విజయసాయి పక్కా అనే లెక్కతో, ఇంతవరకు పార్టీలో అందరూ మూడు ఖాళీల గురించే మాట్లడుతూ వచ్చారు. మూడు స్థానాల్లో ఒకటి మైనార్టీ..మరకొటి ప్రముఖ పారిశ్రామిక వేత్త సతీమణి..మరొకటి బీసీ లేదా ఎస్సీ కి కేటాయిస్తారనే ప్రచారం జరిగింది. అయితే ఇప్పుడు తాజాగా, సినిమా రంగం నుంచి ఒకరికి అవకాశం ఇస్తారనే ప్రచారం జరుగుతోంది.

# కొత్త సంస్కరణలతో అడుగులు

తిరుపతి, ఏప్రిల్ 22, పాలనా పరంగా నూతన సంస్కరణలు తీసుకొచ్చి ఎప్పటికప్పుడు ప్రజల్లో తనదైన ముద్ర వేసుకుంటున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి తాజాగా పార్టీని మరింత పటిష్ట పరిచేందుకు శ్రీకారం చుట్టారు. జిల్లాల పునర్విభజన అనంతరం పార్టీ నూతన అధ్యక్షులను నియమించారు. వీరితో పాటు పార్టీ రీజినల్ కో? ఆర్డినేటర్లు, జిల్లా ఇన్చార్జ్ మంత్రులకు బాధ్యతలు అప్పగించారు. దీంతో పార్టీ నేతలు, కార్యకర్తల్లో ఉత్సాహం నెలకొంది. కర్నూలు, నంద్యాల జిల్లాల రీజినల్ కో ఆర్డినేటర్లుగా సజ్జల రామకృష్ణారెడ్డి, ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్రెడ్డిని నియమించారు. సీఎం వైఎస్ జగన్మోహన్రెడ్డికి అత్యంత సన్నిహితుడైన సజ్జల రామకృష్ణారెడ్డి రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా ఉన్నారు. ఆయనను రీజినల్ కో ఆర్డినేటర్గా నియమించడం పార్టీకి మరింత బలం చేకూర్చనుంది. గతంలో కూడా ఉమ్మడి జిల్లా బాధ్యతలు నిర్వహించి, అందరినీ సమన్వయం చేస్తూ 2019 ఎన్నికల్లో అన్ని స్థానాల్లో పార్టీ గెలుపొందేలా సజ్జల రామకృష్ణారెడ్డి కృషి చేశారు. కర్నూలు, నంద్యాల జిల్లాలపై పూర్తి అవగాహన ఉన్న ఆయనకే మళ్లీ బాధ్యతలు అప్పగిండంతో పార్టీ నాయకులు, కార్యకర్తలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా అధ్యక్షుల నియామకంలో వైఎస్సార్సీపీ సీనియార్టీకి ప్రాధాన్యత ఇచ్చింది. కర్నూలు జిల్లా అధ్యక్షుడిగా మంత్రాలయం ఎమ్మెల్యే, పార్టీ సీనియర్ నేత వై. బాలనాగిరెడ్డిని నియమించింది. ఈయన మొదటి నుంచి వైఎస్సార్ అభిమానిగా ఉంటూ వచ్చారు. పార్టీ ఆవిర్భావం నుంచి వైఎస్సార్సీపీలో ఉన్నారు. వరుసగా 2009, 2014, 2019 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలుపొంది, విశేష ప్రజాదరణ పొందారు. సీనియర్ నేత అయిన బాలనాగిరెడ్డికి జిల్లాలో మంచి పేరుంది. అందరినీ కలుపుకుని వెళ్లే స్వభావం ఉన్న నేతగా గుర్తింపు పొందారు. ఈయన కర్నూలు జిల్లా అధ్యక్షుడు కావడంతో వైఎస్సార్సీపీ మరింత బలోపేతం కానుంది. నంద్యాల జిల్లా అధ్యక్షుడిగా సీనియర్ నేత, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్రెడ్డిని నియమించారు. ఈయన పాణ్యం నియోజకవర్గం నుంచి ఆరుసార్లు శాసనసభ్యుడిగా ఎన్నికయ్యారు. నిత్యం అందుబాటులో ఉంటూ, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ ప్రజాభిమానాన్ని పొందారు. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తున్నారు. నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకోవడంలో ఈయనకు విశేష అనుభవం ఉంది.

# ఉపాధి హామీలో రికార్డు

ఏలూరు, ఏప్రిల్ 22, మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా సరికొత్త రికార్డు సృష్టించింది. ప్రభుత్వం ముందు చూపుతో లక్ష్యాలకు మించి పనులను కల్పించి ఉపాధి హామీ చరిత్రలో మైలురాయిగా నిలిచింది. గత ఆర్థిక సంవత్సరం (2021?22)లో జిల్లాలో అత్యధిక పనిదినాలు కల్పించడంతో పాటు అత్యధిక నిధులు ఖర్చు చేశారు. 170.63 లక్షల పనిదినాలు కల్పన లక్ష్యం కాగా 171.14 లక్షల పనిదినాలు కల్పించారు. మొత్తంగా రూ.653.79 కోట్లు ఖర్చు చేయగా కూలీలకు వేతనాలుగా రూ.365.89 కోట్లు అందించారు. మెటీరియల్ చెల్లింపుల కోసం రూ.287.90 కోట్లను వెచ్చించారు. 15 ఏళ్ల ఉపాధి హామీ చరిత్రలో ఇది ఆల్‌టైమ్ రికార్డు అని అధికారులు చెబుతున్నారు. కరోనా సెకండ్‌వేవ్ సమయంలో పేదలకు ఉపాధి హామీ పథకం బాసటగా నిలిచింది. 1.50 కోట్ల పనిదినాల లక్ష్యం : 2022?23లోనూ కూలీలకు పెద్ద ఎత్తున పనులు కల్పించాలని అధికారులు ప్రణాళికలు రచించారు. వేసవితో పాటు ఏడాది పొడవునా పనులు చూపేలా కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు. మొత్తంగా ఈ ఆర్థిక సంవత్సరంలో 1.50 కోట్ల పనిదినాలు కల్పించడం ద్వారా కూలీలకు వేతనాలుగా రూ.320 కోట్ల వరకూ అందించేలా కసరత్తు చేస్తున్నారు. ఇప్పటికే పలు అభివృద్ధి కార్యక్రమాలు ఉపాధి హామీ నిధులతో చేపట్టారు. ఆయా పనులు వివిధ పనుల్లో ఉన్నాయి. దీంతోపాటు కొత్తగా పనులను గుర్తించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. కరోనా వంటి విపత్కర సమయం లోనూ ఉపాధి హామీ పథకంలో కూలీలకు పనులు కల్పించిన ఘనత రాష్ట్ర ప్రభుత్వానికి దక్కింది. 2021?22లో ఉపాధి హామీలో లక్ష్యానికి మించి పనులు కల్పించడంతో పాటు అత్యధికంగా కూలీలకు వేతనాలు చెల్లించారు. ఉమ్మడి జిల్లాలో 5.70 లక్షల కుటుంబాలకు చెందిన 9.99 లక్షల మంది ఉపాధి హామీ కూలీలకు 171.14 లక్షల పనిదినాలు కల్పించారు. 27,619 కుటుంబాలకు వంద రోజుల పనులు కల్పించారు. సగటున రోజుకు రూ.220.49 వేతనంగా అందించారు. ఉపాధి హామీ పథకంలో అభివృద్ధికి బాటలు వేస్తున్నారు. గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్ భవనాల నిర్మాణం, జగనన్న లేఅవుట్లలో మౌలిక వసతుల కల్పనకు ఉపాధి నిధులు వెచ్చిస్తున్నారు. గత ఆర్థిక సంవత్సరంలో జగనన్న లేఅవుట్లలో రూ.124 కోట్లతో 1,318 పనులు పూర్తి చేశారు. మొక్కలు, తోటల పెంపకానికీ నిధులు అందించారు. ఇనిస్టిట్యూషన్ ప్లాంటేషన్‌లో భాగంగా 118 ప్రభుత్వ సంస్థల్లో 7,231 మొక్కలు నాటారు. 1,090 జలసంరక్షణ పనులు పూర్తి చేశారు. ఉపాధి హామీ పథకంలో అడిగిన ప్రతిఒక్కరికీ పనులు కల్పించే విధంగా క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకున్నారు.. 2022?23లోనూ లక్ష్యానికి మించి పనులు చేపట్టేలా కృషిచేస్తున్నారు.. జిల్లా నీటి యాజమాన్య సంస్థ పరిధిలో పనులనూ సత్వరం పూర్తి చేయించేందుకు ప్రయత్నిస్తున్నారు..

# రోడ్డు ప్రమాదంలలో దంపతుల మృతి

కోదాడ సూర్యాపేట జిల్లా కోదాడలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. బైక్ ని వేగంగా వచ్చిన కారు వెనుక నుండి ఢీకొట్టింది. ఈ ఘటనలో భార్యభర్త కూతురు మృతి చెందాగా మరో ఇద్దరు చిన్న పిల్లలకు తీవ్ర గాయాలు అయ్యాయి. బోయాల శ్రీనివాస్(32), భార్య నాగమణి(28) పాపా(8) మృతి, మృతులు కోదాడ మండలం నల్లబండగూడెం గ్రామానికి చెందిన వారుగా గుర్తించారు. నల్లబండగూడెం నుండి శ్రీను అత్తవారింటికి చిలుకూరు మండలం సీతారామపురం గ్రామానికి బైక్ పై భార్య ముగ్గురు కుతుళ్ళతో వెళ్తుండగా కోదాడ టౌన్ గుడిబండ ఫ్లై ఓవర్ వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. బైకు పై వెళ్తున్న కుటుంబ సభ్యులను వెనుక నుండి అతివేగంతో ఢీకొట్టడంతో.. ఫ్లైఓవర్ మీదనుండి కింద పడిపోయిన శ్రీనివాస్ భార్య ముగ్గురు కూతుళ్లు. ఈ ఘటన లో గాయపడిన వారిని మెరుగైన వైద్యం కోసం ఖమ్మం ఆసుపత్రికి తరలించగ.. మృతదేహాలను కోదాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు

# మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించిన చైర్ పర్సన్ సుప్రజ

బుచ్చిరెడ్డి పాళెం బుచ్చి నగర పంచాయతీలో 4వ వార్డు బాలకృష్ణారెడ్డి గిరిజన కాలనీ అంగనువాడీ ఫ్రీ ప్రైమరీ స్కూల్ మరియు ఆదర్శ ప్రాథమిక పాఠశాలలను సందర్శించి విధ్యార్థులతో ముచ్చటిస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకుని జగనన్న గోరుముద్ద పథకం (మధ్యాహ్న భోజనం) యొక్క నాణ్యతను పరిశీలించి గతంలో జరిగిన పొరపాట్లు జరగకుండా ఇప్పుడు నాణ్యమైన భోజనం పెడుతున్న నిర్వాహకురాలిని ఇదేవిధంగా పెట్టాలని అభినందించి పిల్లలకు స్వయంగా వడ్డించి నాడు - నేడు లో కార్పొరేట్ స్కూల్ లకు ధీటుగా ప్రభుత్వ స్కూళ్ళ రూపురేఖలు మార్చిన మన జగనన్న - మన ప్రసన్నన్న ఆకాంక్షలకు అణుగుణంగా ప్రతిఒక్కరూ బాగా చదవాలని సూచించిన చైర్ పర్సన్

# వైయస్ ఆర్ సున్నా వడ్డీ బటన్ నొక్కి పొదుపు సంఘాలకు జమ చేసిన సీఎం

నంద్యాల నంద్యాల జిల్లా కేంద్రంలో శుక్రవారం నాడు స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి ప్రభుత్వ వీప్. ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్ రెడ్డి. జిల్లా కలెక్టర్ డాక్టర్. మనజీర్ జిలాని సామూన్. ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్ర నాథ్ రెడ్డి. తదితరులు సీయం జగన్ మోహన్ రెడ్డి ప్రసంగం విడియో కాన్ఫరెన్స్ హాల్ యందు లైవ్ ద్వారా సమీక్షించారు. . నంద్యాల జిల్లా వ్యాప్తంగా అర్హత కలిగిన 36,913 స్వయం సహాయక సంఘాలకు 3,87,867 మంది ఆడ పడుచులకు నేరుగా వారి తరపున పొదుపు సంఘాల నాయకుల ఖాతాల్లో 56,55 కోట్ల రూపాయలను జమ చేశారని తెలిపారు.

# బరితెగించిన ప్రేమోన్మాది

హనుమకొండ మరో ప్రేమోన్మాది బరితెగించాడు తనను ప్రేమించడం లేదంటూ ప్రియురాలి గొంతు కోసిన ఘటన హనుమకొండ జిల్లాలో చోటు చేసుకుంది. వరంగల్ జిల్లా నర్సంపేట కు చెందిన అనూష అమ్మానాన్నలతో కలిసి హనుమకొండ జిల్లా పోచమ్మ కుంట గాంధీనగర్ లో ఉంటూ కాకతీయ యూనివర్సిటీ లో ఎం సి ఏ ఫైనలియర్ చదువుతోంది. ఈరోజు ఉదయం ఇంట్లో ఉన్న అనూషను ప్రేమించాలంటూ అజార్ అనే వ్యక్తి గుర్తు తెలియని ఆయుధంతో గొంతు కోసి పరారయ్యాడు విషయం తెలుసుకున్న స్థానికులు చికిత్స కోసం అనూషను ఎంజీఎం హాస్పిటల్ తరలించారు

# రీజినల్ కో-ఆర్డినేటర్లకు ఇబ్బందులు

విజయవాడ, ఏప్రిల్ 22, వైఎస్సార్ సీపీలో జిల్లా అధ్యక్షులు, రీజినల్ కో-ఆర్డినేటర్లకు కొన్ని జిల్లాల్లో ఇబ్బందులు తప్పేలా కనబడటం లేదు. కొత్తగా ఏర్పడిన ఎన్టీఆర్ జిల్లాకు పార్టీ అధ్యక్షుడిగా మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాసరావు ను పార్టీ అధినేత వైఎస్ జగన్ నియమించారు. ఇక ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలకు రీజినల్ కోఆర్డినేటర్ గా చిలకలూరిపేటకు చెందిన మర్రి రాజశేఖర్ కు బాధ్యతలు అప్పగించారు. అయితే జిల్లాలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పాటు ఇతర నేతల మధ్య ఇప్పటికే అంతర్గతంగా కొన్ని విభేదాలున్నాయి. ఇటీవల మంత్రిపదవి దక్కకపోవడంతో సామినేని ఉదయభానుతో పాటు తిరువూరు ఎమ్మెల్యే రక్షణ నిధి కూడా అసంతృప్తి వ్యక్తం చేసారు. కనీసం పార్టీలో అయినా తనకు గౌరవం దక్కుతుందని ఉదయభాను భావించారు. జిల్లా అధ్యక్షుడిగానో లేక రీజినల్ కో ఆర్డినేటర్ అయినా వస్తుందని భావించారు ఉదయభాను. ఇప్పటికే తనకు మంత్రి పదవి రాకపోవడానికి కారణం జిల్లాలో ఉన్న కొంతమంది పార్టీ నేతల వల్లే అని బాహాటంగానే ఆరోపణలు చేశారు. తీరా పార్టీ పదవి కూడా రాకపోవడంతో ఆయన మరింత అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. ఇలాంటి పరిస్థితుల్లో జిల్లా అధ్యక్షుడితో ఎంతవరకూ కలిసి పనిచేస్తారనేది కూడా అనుమానంగా మారింది. ఇక మంత్రి పదవిపై గంపెడాశలు పెట్టుకున్న రక్షణ నిధి కూడా మంత్రివర్గ విస్తరణ తర్వాత అనుచరుల వద్ద అసంతృప్తి వ్యక్తం చేయడంతో పాటు కొన్ని రోజులుగా మౌనంగానే ఉండిపోయారు. ఈ ఇద్దరు నేతల నుంచి వెల్లంపల్లికి పెద్దగా సహకారం ఉండకపోవచ్చనే వాదన వినిపిస్తుంది. ఈ రెండు స్థానాలు కూడా వైసీపీకి కీలక స్థానాలు కావడంతో వీరిని ఎలా కన్విన్స్ చేస్తారనేది చూడాలి. ఇక ఇప్పటివరకూ జిల్లా నుంచి మంత్రిగా ప్రాతినిధ్యం వహించినప్పటికీ కేవలం విజయవాడతో పాటు తన నియోజకవర్గంపైనే ఎక్కువ ఫోకస్ పెట్టారు మాజీ మంత్రి వెల్లంపల్లి. విజయవాడ సెంట్రల్ నుంచి ఉన్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు, తూర్పు నియోజకవర్గ ఇంచార్జిగా ఉన్న దేవినేని అవినాష్ నుంచి వెలంపల్లికి సహకారం బాగనే ఉంటుంది. మైలవరం ఎమ్మెల్యే గా ఉన్న వసంత కృష్ణ ప్రసాద్ కు కూడా వెల్లంపల్లితో రిలేషన్ బాగానే ఉండటంతో ఇక్కడ ఎలాంటి సమస్య ఉండదు. నందిగామ నుంచి ఎమ్మెల్యే,ఎమ్మెల్సీగా ఉన్నమొండితోక బ్రదర్స్ కూడా పార్టీ కోసం కలిసి పనిచేయనున్నారు. మొత్తంగా ఒకరిద్దరు ఎమ్మెల్యేలు మినహా మిగతా నేతల నుంచి వెల్లంపల్లికి పూర్తి సహకారం ఉంటుందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఇదే సమయంలో రీజినల్ కోఆర్డినేటర్ గా ఉన్న మర్రి రాజశేఖర్ ఎప్పటి నుంచో ఎమ్మెల్సీ పదవి ఆశిస్తూ ఉన్నారు. ఉమ్మడి కృష్ణా జిల్లా రాజకీయాలపై పెద్దగా పరిచయం లేదు. దీంతో ఎన్టీఆర్ జిల్లాతో పాటు కృష్ణా జిల్లా నేతలను ఎలా సమన్వయం చేస్తారనేది కూడా ప్రశ్నగా మారింది. పార్టీ పరంగా జిల్లా అధ్యక్షుడిగా వెల్లంపల్లి ఉంటే, రీజినల్ కోఆర్డినేటర్ గా మర్రి రాజశేఖర్ ఉన్నారు. ఇక ఇంచార్జి మంత్రిగా తానేటి వనితను నియమించడంతో పార్టీ మరింత బలోపేతం అవుతుందని కూడా వైసీపీ వర్గాలు చెబుతున్నాయి. మొత్తంగా ఎన్టీఆర్ జిల్లాలో కొత్తగా పార్టీ బాధ్యతలు తీసుకుంటున్న నేతలు.. వర్గ విబేధాలకు చెక్ పెట్టి పార్టీ బలోపేతం దిశగా ముందుకెళ్తారనేది పార్టీ వర్గాల టాక్.

# కావాలనే చంద్రబాబు దాడి చేయించారు: జోగి రమేష్



విజయవాడ: విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో జరిగిన ఘటన అందరూ బాధపడాల్సిన దురదృష్టకర సంఘటనని మంత్రి జోగి రమేష్ అన్నారు. సీఎం వైఎస్ జగన్ వెంటనే స్పందించి అన్ని శాఖలను ఆదేశించారని తెలిపారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ.. నిందితులను అరెస్ట్ చేయడం, నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులను సస్పెండ్ చేయడం వేగంగా జరిగిపోయాయని అన్నారు. యువతి ఆరోగ్యం మెరుగయ్యే వరకూ ప్రభుత్వం ట్రీట్‌మెంట్ అందిస్తుందని చెప్పారు. శవ రాజకీయాలు చేయడానికి చంద్రబాబు అక్కడికి వచ్చారని మండిపడ్డారు. కాల్ మనీ సెక్స్ రాకెట్ నేతలు మహిళా కమిషన్ చైర్మన్‌పై దాడికి దిగారని విరుచుకుపడ్డారు. వేలకోట్ల రూపాయలు అక్కచెల్లెమ్మల అకౌంట్లలో వేసే సమయంలోనే కావాలని చంద్రబాబు ఇక్కడ హడావుడి చేశారని మండిపడ్డారు. ఇది బాధ్యత గల ప్రభుత్వమని, వాసిరెడ్డి పద్మపై దాడి చేయాల్సిన అవసరం ఏముందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వాసిరెడ్డి పద్మపై జరిగిన దాడిని ఆయన తీవ్రంగా ఖండించారు. ఇలాంటి ఘటనలు ఎక్కడ జరిగినా ఉక్కుపాదంతో అణచివేస్తామని జోగి రమేష్ అన్నారు. చంద్రబాబుకు మహిళల గురించి మాట్లాడే అర్హత లేదని దుయ్యబట్టారు. రిషితేశ్వరి ఘటనలో తాము ఆందోళన చేస్తే ఎఫ్ఐఆర్ కూడా కట్టలేదని విమర్శించారు. టీడీపీ నేత వినోద్ జైన్ వేధింపులు తాళలేక చిన్నారి మృతి చెందిందని తెలిపారు.

# సచివాలయ వాలంటీర్ల సేవలు అభినందనీయం

**వైసీపీ రాష్ట్ర కార్యదర్శి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి**

**- మేయర్ స్రవంతి జయవర్ధన్**

నెల్లూరు సంక్షేమ పాలన కోసం ముఖ్యమంత్రి ఆలోచనలతో రూపొందించిన సచివాలయ వ్యవస్థలో వాలంటీర్ల పాత్ర ఎంతో కీలకమని, ఉగాది పురస్కారాలను ప్రతి ఒక్క వాలంటీర్ సాధించుకునేలా కృషి చేయాలని వైసీపీ రాష్ట్ర కార్యదర్శి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి మరియు నగర మేయర్ స్రవంతి జయవర్ధన్ గార్లు పేర్కొన్నారు. స్థానిక 35వ డివిజన్ నందు గల లేక్ వ్యూ కాలనీ, 2వ వీధి లోని 35/2 బషీర్ నగర్ సచివాలయం నందు విధులు నిర్వహిస్తున వాలంటీర్లకు ఉగాది ప్రోత్సాహక పురస్కారాలను శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమానికి వైసీపీ రాష్ట్ర కార్యదర్శి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి గారు మరియు నగర మేయర్ స్రవంతి జయవర్ధన్ గార్లు ముఖ్య అతిధులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ, వార్డు వాలంటీర్ల ఉగాది పురస్కారాలకు ఎంపికైన అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గారు మన దేశంలో, ప్రపంచంలో కూడా ఎక్కడా లేని విధంగా పరిపాలనలో స్వర్ణయుగం తెచ్చేలా 2019 ఆగస్టు 15న వాలంటీర్లను సచివాలయ వ్యవస్థలో భాగం చేసారని తెలిపారు. ప్రపంచాన్ని వణికించిన కరోనా సమయంలో సైతం ప్రజలకు కావలసిన సేవలు, ప్రజలకు అందాల్సిన పథకాలను ప్రభుత్వం నుంచి చేరవేసే రథసారథులుగా వాలంటీర్లు నిలిచారని కొనియాడారు. వాలంటీర్ల విశిష్ట సేవలను మెచ్చిన గౌరవ ముఖ్యమంత్రి వర్యులు సేవా మిత్రా, సేవ రత్న, సేవా వజ్ర పేర్లతో ఉగాది పుర్కారాలను ప్రత్యేకంగా నిర్వహించడం శుభ పరిణామం అని వారు ప్రశంసించారు. అవార్డులు అందుకున్న వాళ్లకి, అందుకోని వాళ్ళకి కొద్దిపాటి తేడా మాత్రమే ఉన్నదని, అవార్డులు రానివాళు మరింత కృషి చేసి రాబోయే సంవత్సరంలో గౌరవాన్ని అందుకోవాలని మేయర్ గారు సూచించారు. ఈ కార్యక్రమంలో 35వ డివిజన్ కార్పొరేటర్ యాకసిరి వాసంతి, ఇంచార్జ్ వై.శరత్ గార్లు మరియు వైసిపి నాయకులు పాల్గొన్నారు.

# బీడీ టెకే దారులకు కమిషన్ రేటు పెంపుదలకు చర్చలకు ఆహ్వానించాలి

**ఏఐటీయూసీ రాష్ట్ర నాయకుడు సుతారి రాములు డిమాండ్**

కోరుట్ల ఏప్రిల్ 22 బీడీ పరిశ్రమ కు నిత్యం బీడీలను గంపల ద్వారా తేస్తున్న బీడి టెకే దారులకు కమిషన్ రేటు 50 శాతం పెంచాలని ఏఐటీయూసీ రాష్ట్ర నాయకుడు సుతారి రాములు బీడీ యాజమాన్యంను డిమాండ్ చేశారు. జగిత్యాల జిల్లా కోరుట్ల డివిజన్ కేంద్రంలో ఏర్పాటు చేసిన బీడీ టేక దారుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా కరీంనగర్ ,నిజామాబాద్ మెదక్ ఆదిలాబాద్, వరంగల్ ఉమ్మడి జిల్లాలో దాదాపు పది వేల మంది బీడి టెకే దారులు వివిధ కంపెనీలలో ప్రతినిత్యం బీడీ కార్మికులు చేసిన జమకట్టి గంపల ద్వారా, చేరవేస్తూ కంపెనీ యజమానులకు బిడి కార్మికులకు వారధిగా కొనసాగుతున్నారని పేర్కొన్నారు. వెయ్యి బీడీలకు కమిషన్ 15 రూపాయలు చెల్లిస్తూ ఉంటారని తెలిపారు. బీడీ కమిషన్ దారులకు గత రెండు ఏండ్ల కింద కుదిరిన ఒప్పందం గడువు మార్చి నెలలో ముగిసిందని తెలిపారు. గడిచిన గత నాలుగు నెలల్లో పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగి రవాణా చార్జీలు నిత్యవసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోయినందున కమిషన్ రేట్ 50 శాతం పెంచాలని దీనికొరకు చర్చలకు పిలవాలని డిమాండ్ చేశారు. 2010 సంవత్సరంలో చేసుకున్న ఒప్పందం ప్రకారం బీడి టెక్ దారులు నుండి తీసుకున్న శేఖర్ డిపాజిట్ డబ్బుకు వడ్డీ ఇవ్వాలని బీడి టెక్ అందరికీ గుర్తింపు కార్డులు ఇచ్చి పీఎఫ్ ,ఈఎస్ఐ ప్రమాద బీమా సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ నోటీసులో పేర్కొన్నామని, వెంటనే సమస్యలపై చర్చలు జరపాలని కోరారు. లేనియెడల దశలవారీగా కంపెనీల ముందు ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో దేశాయ్ బీడి,టెలిఫోన్ బీడీ ,శివాజీ బీడీ, చార్ భాయ్ బీడీ, గణేష్ బీడీ, 30 నెంబర్బీడి, పిజే పటేల్ బీడీ, ఠాకూర్ బీడీ మయూరి బీడీ జెమినీ గౌతమ్ బీడీ, జనతా బీడీ, ప్రభు రామ్, బీ డిటెక్ దారులు సాంబయ్య శంకర్ బాబురావు గంగాధర్ నరసయ్య రాజేశం రవి బలరాం ధర్మపురి భూమయ్య ప్రసాద్ లింగం మల్లేశం ప్రశాంత్ లక్ష్మణ్ సుదర్శన్ వెంకటి గణేష్ బుచ్చన్న శ్రీనివాస్ వెంకన్న తదితరులు పాల్గొన్నారు

# లాలుకు బెయిల్ మంజూరు

పాట్నాఏప్రిల్ 22, బీహార్ మాజీ ముఖ్యమంత్రి, ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్‌కు బెయిల్ మంజూరు చేసింది కోర్టు.. రూ.139 కోట్ల దాణా కుంభకోణం కేసులో లాలూ ప్రసాద్ యాదవ్‌కు హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. డోరాండా ట్రెజరీ నుంచి రూ. 139 కోట్లకు పైగా అపహరణకు సంబంధించిన దాణా కుంభకోణం కేసులో.. 73 ఏళ్ల లాలూ ప్రసాదవ్ యాదవ్‌ను ఫిబ్రవరిలో దోషిగా తేల్చింది సీబీఐ కోర్టు.. శిక్ష కూడా విధించింది.. అయితే, ఆయన ఆరోగ్య పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని జార్ఖండ్ హైకోర్టు ఆయనకు బెయిల్ ఇచ్చింది. ఈ సందర్భంగా లాలూ న్యాయవాది మాట్లాడుతూ? లాలూకు హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది.. రూ. 10 లక్షల జరిమానా, రూ.1 లక్ష విలువైన పూచీకత్తును సమర్పించాలని ఆదేశించినట్టు తెలిపారు..ఈ కేసులో లాలూ తన ఐదేళ్ల శిక్షలో సగం అనుభవించాడని కోర్టుకు విన్నవించామన్న న్యాయవాది.. ఇప్పటికే 41 నెలల జైలు శిక్ష అనుభవించారని వెల్లడించారు.. ఇక, హైకోర్టు ఉత్తర్వులు మంగళవారం నాటికి దిగువ కోర్టుకు తెలియజేయబడతాయని, బెయిల్ బాండ్‌ను సమర్పించి విడుదల ఆర్డర్‌ను పొందుతామన్నారు.. కాగా, డోరాండా ట్రెజరీ నుంచి రూ. 139 కోట్లకు పైగా ఎగనామం పెట్టిన ఐదో దాణా కుంభకోణం కేసులో బీహార్ మాజీ ముఖ్యమంత్రికి రాంచీలోని ప్రత్యేక సీబీఐ కోర్టు ఐదేళ్ల జైలు శిక్ష మరియు రూ. 60 లక్షల జరిమానా విధించింది. ఈ వ్యవహారంలో కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని గతంలో కోర్టు ఇచ్చిన ఆదేశాలను ఏజన్సీ పాటించలేకపోయిందని, మరికొంత సమయం కావాలని స్కామ్‌పై దర్యాప్తు చేస్తున్న సీబీఐ ఏప్రిల్ 8న జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్‌కు తెలియజేసిన విషయం తెలిసిందే.

# గాయపడిన యువ ఇంజనీర్ మృతి

బద్వేలు ల్యాప్టాప్ పేలి తీవ్రంగా గాయపడిన యువ ఇంజనీర్ సుమలత (20) శుక్రవారం మధ్యాహ్నం మృతి చెందింది ఈ విషయాన్ని సుమలత మృతి చెందిన విషయాన్ని బి కోడూరు ఎస్ఐ ధృవీకరించారు తిరుపతిలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో సుమలత చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతి చెందడం జరిగింది బద్వేలు నియోజవర్గం బి కోడూరు మండలం మేకవారిపల్లె గ్రామానికి చెందిన సుమలత బెంగళూరులో ఒక కంపెనీలో సాఫ్ట్వేర్ ఇంజనీరుగా పని చేస్తున్నారు ఇంట్లోనే ఉండి కంపెనీ పనులు ఏం చేస్తున్నారు 5 రోజుల క్రితం లాప్టాప్ లో ఆమె పని చేస్తుండగా అది ఒక్కసారిగా పేలి పోయి సుమలత తీవ్రంగా గాయపడింది చికిత్స నిమిత్తం మొదట కడపలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు అక్కడ సాధ్యం కాకపోవడంతో తిరుపతి కి తరలించి అక్కడ గత ఐదు రోజులుగా చికిత్స అందిస్తున్నారు పరిస్థితి విషమించడంతో శుక్రవారం మధ్యాహ్నం సుమలత మృతి చెందారు

# అధిక ధరలపై ఈ నెల 25న సచివాలయం ఎదుట వామపక్షాల ధర్నా

బద్వేలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను మరియు ధరల పెంపును నిరసిస్తూ వామపక్ష పార్టీల పిలుపులో భాగంగా సీపీఐ, సీపీఎం పార్టీల ఈనెల 25న సచివాలయాల ఎదుట ధర్నా నిర్వహిస్తున్నామని, ఈధర్నాలలో ప్రజలందరూ భాగస్వాములై జయప్రదం చేయాలని సీపీఐ, సీపీఎం నాయకులు పిలుపునిచ్చారు. ఈరోజు ఉదయం సిపిఐ కార్యాలయం జేవి భవనము నందు వామపక్ష పార్టీల నాయకులు పత్రికా విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ పట్టణ కార్యదర్శి చంద్ర మోహన్ రాజు, సిపిఎం పట్టణ నాయకులు చాంద్ భాషా మాట్లాడుతూ, కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వాలు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను మరిచి చట్టసభల్లో తన పూర్తి మెజారిటీ ఉందనే అహంకారంతో ఏకపక్ష నిరంకుశ పరిపాలన సాగిస్తున్నారని ఆయన విమర్శించారు. కరోనా కష్టకాలం నుండి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న పేద సామాన్య మధ్య తరగతి ప్రజలపై మూలిగే నక్కపై తాటికాయ పడ్డ చందంగా పెట్రోలు, డీజిల్, గ్యాస్, వంటనూనె, నిత్యావసర వస్తువుల ధరలు, విద్యుత్ ఛార్జీల పేరుతో అదనపు భారాన్ని మోపడం దుర్మార్గమని ఆయన విమర్శించారు. రాజన్న రాజ్యం తెస్తానని, ప్రతి కుటుంబానికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తామని ప్రగల్బాలు పలికి నేడు అధికారంలోకి వచ్చిన జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం నేడు అదనపు చార్జీల పేరుతో విపరీతంగా విద్యుత్ చార్జీలు పెంచి అప్రకటిత కరెంటు కోతలు విధిస్తూ ప్రాణాలు సైతం పోతున్నా పట్టించుకోకుండా నియంతృత్వ రాక్షస పాలన కొనసాగిస్తున్నారని, ఇదేనా! మీరు చెప్పిన రాజన్న రాజ్యం? అని ప్రశ్నించారు. ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పునరాలోచన చేయాలని వారు డిమాండ్ చేశారు.

# షుగర్ ఫ్యాక్టరీని కాపాడుకుందాం - రైతులను నిలబెడదాం

**చెరుకు రైతు సంఘం నాయకులు**

కోవూరు. ఏప్రిల్.22 కోవూరు కో ఆపరేటీవ్ చక్కర కర్మాగారం వద్ద ఆంధ్రప్రదేశ్ చెరకు రైతుల సంఘం ఆధ్వర్యంలో షుగర్ రైతుల సదస్సు నిర్వహించారు ఈ సదస్సులో ఈ షుగర్ ఫ్యాక్టరీ పరిధిలోని చెరకు రైతులు రైతు సంఘ నాయకులు పాల్గొని షుగర్ ఫ్యాక్టరీని ఎలా కాపాడుకుందాం అంటూ కార్యచరణపై చర్చించారు. ఈ సదస్సులో ఆలిండియా చెరుకు రైతుల సంఘం సహాయ కార్యదర్శి రవీంద్రన్ మాట్లాడుతూ ఈ చక్కెర ఫ్యాక్టరీని అమ్మే హక్కు అధికారం ప్రభుత్వానికి లేదని ఇది రైతుల అనుసంధానంతో ఏర్పడిన ఫ్యాక్టరీ అని ఆయన తెలియజేశారు ఈ చక్కెర కర్మాగారానికి నిధులు కేటాయించి ఫ్యాక్టరీని పునరుద్ధరించాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఆరు ఫ్యాక్టరీలు మూతపడ్డాయని వాటికి నిధులు మంజూరు చేసి వెంటనే షుగర్ ఫ్యాక్టరీలను పునఃప్రారంభించాలి అలా చేయకుంటే ఉద్యమాలు ఉధృత్తం చేస్తామన్నారు. ఉద్యోగస్తులు బకాయిలను తక్షణమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. చెరకు రైతులందరు కలసి మా షుగర్ ఫ్యాక్టరీ ని కాపాడండి మా ఫ్యాక్టరీ ని పునరుద్దరించండి చెరకు రైతులను ఆదుకోండి అంటూ జిల్లా కలెక్టర్ కి సీఎం గారికి వినతిపత్రం అందజేయాలని ఆలిండియా చెరుకు రైతుల సంఘం సహాయ కార్యదర్శి రవీంద్రన్ రైతులకు సూచించారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ చెరుకు రైతు సంఘం కార్యదర్శి మర్రాపు సూర్యనారాయణ మాట్లాడుతూ.సీఎం జగన్మోహన్ రెడ్డి పాదయాత్ర లో కోవూరు షుగర్ ఫ్యాక్టరీనీ పునరిద్దిస్తానని హామీ ఇచ్చి, నేడు అధికారంలో ఉండగా షుగర్ ఫ్యాక్టరీ మూసివేసి విలువైన ఆస్తులను అమ్మేయాలని ప్రభుత్వం ఆలోచిస్తోందని,ఆ ఆలోచనలు ఉపసంహరించుకుని ఉద్యోగస్తులకు చెల్లించాల్సిన బాకీలు చెల్లించి , తక్షణమే షుగర్ ఫ్యాక్టరీ పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇచ్చిన 15 జీవోను రద్దు చేసి చెరకు రైతులను ఆదుకోవాలని ఆయన కోరారు. వరికి గిట్టుబాటు ధర లేనందు వల్ల రైతులు చక్కెర కర్మాగారాలను అందుబాటులోకి తీసుకువస్తే కొంత మేర చెరకు పండించుకోవచ్చున్నారు ఈ సదస్సులో జిల్లా చెరుకు రైతు సంఘం నాయకులు ఎర్రమరెడ్డి గోవర్ధన్ రెడ్డి,గుణపాటి ప్రసాద్ రెడ్డి,వెంకమరాజు, చంద్రరాజగోపాల్,మూలి వెంగయ్య,గంటా లక్మిపతి,ముత్యాలు గురునాధం,తుళ్లూరు గోపాల్,బిళ్ళా రగురామయ్య గండవరపు శేషయ్య. తదితరులు పాల్గొంన్నారు

# మండు టెండల్లో చల్లని కబురు

హైదరాబాద్. ఏప్రిల్ 22, ఆంధ్రప్రదేశ్, యానాం లలో దిగువ ట్రోపో ఆవరణంలో దక్షిణ, ఆగ్నేయ గాలులు వీస్తున్నాయని, వీటి ఫలితంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రాగల మూగు రోజులు కొన్ని చోట్ల వర్షాలు, మరికొన్ని చోట్ల పొడి వాతావరణం ఉండే అవకాశం ఉందని అమరావతి వాతావరణ కేంద్ర అధికారులు తెలిపారు. వాతావరణ కేంద్రం నివేదిక ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రాగల మూడు రోజుల వరకు వాతావరణం ఇలా ఉండనుంది. ఉత్తరకోస్తాంధ్ర, యానాం ప్రాంతంలో ఇవాళ తేలికపాటి వర్షాలు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశం ఉంది. రేపు తేలికపాటి వర్షాలు/ఉరుములతో కూడిన జల్లులు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశం ఉంది. ఉరుములతో కూడిన మెరుపులు ఒకటి లేదా రెండు చోట్ల సంభవించే అవకాశం ఉంది. ఎల్లుండి తేలికపాటి వర్షాలు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముంది. ఇక దక్షిణ కోస్తాంధ్రలో ఇవాళ, రేపు, ఎల్లుండి వాతావరణం పొడిగా ఉండే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. రాయలసీమలోనూ ఇంచుమించు ఇదేరకమైన వాతావరణం ఉంటుందన్నారు. ఇవాళ, రేపు, ఎల్లుండి వాతావరణం పొడిగా ఉండే అవకాశం ఉందని అమరావతి వాతావరణ కేంద్రం డైరెక్టర్ ప్రకటించారు.

# మహిళల ఆర్థిక స్వావలంబనే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

**జిల్లా కలెక్టర్ డా. మనజీర్ జిలాని సామూన్**

నంద్యాల ( విభారె) స్వయం సహాయక బృందాల మహిళల అభివృద్ధి చెంది మెరుగైన ఆర్థిక పరిస్థితి కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం మూడవ విడత వైఎస్సార్ సున్నవడ్డీ పథకం అమలులోకి తెచ్చిందని జిల్లా కలెక్టర్ డా. మనజీర్ జిలాని సామూన్ తెలిపారు. ఈ పథకం కింద నంద్యాల జిల్లా వ్యాప్తంగా అర్హత గల 36,913 స్వయం సహాయక సంఘాల్లోని 3,87,867 మంది అక్క చెల్లెమ్మలకు నేరుగా 56.55 కోట్ల రూపాయల వడ్డీని వారి తరఫున పొదుపు సంఘాల అక్కాచెల్లెమ్మలను బ్యాంకు ఖాతాల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి కంప్యూటర్ బటన్ నొక్కి జమ చేసారని జిల్లా కలెక్టర్ తెలిపారు. గురువారం స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో రాష్ట్ర వ్యాప్తంగా ఒంగోలులో 9.76 లక్షల స్వయం సహాయక సంఘాలలోని 1,02,16,410 మంది అక్కచెల్లెమ్మలు బ్యాంకులకు కట్టవలసిన రూ.1,261 కోట్ల వడ్డీని వారి తరపున పొదుపు సంఘాల అక్కచెల్లెమ్మల బ్యాంకు×ఖాతాల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి ల్యాప్ టాప్ బటన్ నొక్కి నేరుగా జమ చేసే బృహత్తర కార్యక్రమాన్ని లైవ్ ద్వారా జిల్లా కలెక్టర్ డా. మనజీర్ జిలాని సామూన్, ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్ రెడ్డి, ఆళ్లగడ్డ శాసనసభ్యులు గంగుల బ్రిజేంద్రనాథరెడ్డి, డిఆర్డిఏ ప్రాజెక్ట్ మేనేజర్ బి.శ్రీధర్ రావు, గ్రామీణ పట్టణ స్వయం సహాయక సంఘాల మహిళలు తదితరులు వీక్షించారు. అనంతరం జిల్లా కలెక్టర్ డా. మనజీర్ జిలాని సామూన్ మాట్లాడుతూ నంద్యాల జిల్లాలో మూడవ విడత వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం కింద 36,913 స్వయం సహాయక సంఘాల్లోని 3,87,867 మంది మహిళలకు నేరుగా 56.55 కోట్ల రూపాయల వడ్డీని వారి ఖాతాలో రాష్ట్ర ముఖ్యమంత్రి జమ చేశారన్నారు. ఇందులో గ్రామీణ ప్రాంతాల్లోని 29,885 స్వయం సహాయక సంఘాలకు సంబంధించి 3,15,993 మంది మహిళల ఖాతాల్లో రూ. 46.45 కోట్లు, పట్టణ ప్రాంతాల్లోని 7028 స్వయం సహాయక సంఘాలకు సంబంధించి 71,874 మంది మహిళల ఖాతాల్లో రూ. 10.10 వెరసి మొత్తం 56.55 కోట్ల రూపాయల వడ్డీని జమ చేయడం జరిగిందన్నారు. మహిళల ఆర్థిక స్వావలంబనే ప్రధాన లక్ష్యంతో మహిళలు స్వయం ఉపాధి వైపు అడుగులు వేసేలా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. 2019-20 ఆర్థిక సంవత్సరంలో నంద్యాల× జిల్లాలో 24,632 గ్రూపులకు 47.98 కోట్లు, 2020 - 21 ఆర్థిక సంవత్సరంలో 28,775 పొదుపు సంఘాలకురూ .41.74 కోట్లు గతంలో జమ చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన మూడవ విడత సున్నా వడ్డీ మొత్తాలను స్వయం సహాయక సంఘాల మహిళలు చక్కగా సద్వినియోగం చేసుకొని అభివృద్ధి చెందాలని ప్రభుత్వ విప్ గంగుల ప్రభాకర్ రెడ్డి, ఆళ్లగడ్డ ఎమ్మెల్యే రాజేంద్రనాథ్ రెడ్డి కోరారు.

# మున్సిపాలిటీ పన్నుల వసూలు ఫుల్, పట్టణ అభివృద్ధి నిల్

ఎమ్మిగనూరు( విభారె) పట్టణంలో సిసిరోడ్లు,డ్రైనేజీలు, మంచి నీటి పైప్ లైన్లు ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్ కు వినతి: సిపిఐఎమ్మిగనూరు మున్సిపాలిటీ గ్రేడ్ వన్ స్థాయి ఉన్నప్పటికీ అభివృద్ధిలో మాత్రం పూర్తిగా వెనకబడిందని, మున్సిపల్ అధికారులు పన్నులు వసూలుపై ఉన్న సత్తా పట్టణ అభివృద్ధి పై లేదని తక్షణమే పట్టణంలో సిసి రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు పైపులైన్లు, పట్టణ సమస్యలు పరిష్కరించాలనీ కోరుతూ సిపిఐ పట్టణ సమితి ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ కు వినతి పత్రం ఇవ్వడం జరిగిందని భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) పట్టణ కార్యదర్శి తిమ్మగుడుడు, ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యదర్శి జి. రంగన్న, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు భాస్కర్ యాదవ్, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సత్యన్న, తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మిగనూరు పట్టణంలో ఉన్న 33 వార్డుల్లో అభివృద్ధి పనులు మాత్రం జరగడం లేదని, కేవలం కంకర రాయల్ మాత్రమే వేసి చేతులు దులుపుకోవడం జరిగిందని ఈ సందర్భంగా వారు తెలిపారు. పేరుకు మాత్రం ఎమ్మిగనూరు మున్సిపాలిటీ గ్రేడ్:1 స్థాయి ఉన్నప్పటికీ అభివృద్ధిలో మాత్రం వెనుకబడిందని, పట్టణంలో మైనారిటీ కాలనీ, శివనగర్, లక్ష్మీ పేట, సంజీవ నగర్, హనుమాన్ నగర్, ఎం బి చర్చ్, కోసిగి రోడ్డు ఎల్లమ్మ బిడు, సాయి నగర్, బుడగ జంగాల కాలనీ తదితర వార్డులలో కూడా సిసి రోడ్లు,డ్రైనేజీలు, వేయడం లేదని, గతంలో వేసిన రోడ్లు మొత్తం పాడైపోయి గుంతల పడ్డది జరిగిందని, మున్సిపల్ అధికారులు బలవంతంగా పన్నులు వసూలు పై ఉన్న శ్రద్ధ అభివృద్ధిలో మాత్రం లేదని వారు ఈ సందర్భంగా ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే పట్టణంలో విచ్చలవిడిగా కుక్కలు ప్రజలను గాయ పరుస్తున్న కుక్కల నుంచి ప్రజలను కాపాడడంలో మున్సిపల్ అధికారులు పూర్తిగా విఫలం చెందారని వారు తెలిపారు. కాబట్టి ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు పట్టణంలో ఉన్న 33 వాడలో ఉన్న ప్రజా సమస్యల పైన దృష్టి పెట్టాలని లేనిపక్షంలో సిపిఐ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏ ఐ టి యు సి తాలూకా కార్యదర్శి బాలరాజు, రైతు సంఘం నాయకులు ఎ.ఇ.జబ్బార్, సిపిఐ నాయకులు మల్లికార్జున గౌడ్,రామ లింగప్ప, మునిస్వామి, ఖాదర్,సమీర్, బిజీ విరుపాక్షి నాయుడు, విజయ్, తదితరులు పాల్గొన్నారు

# బస్సు చార్జీలు పెంపు నిర్ణయాన్ని తక్షణమే వెనక్కి తీసుకోవాలి

**ఎస్ ఎఫ్ ఐ డివైఎఫ్ఐ డిమాండ్**

బద్వేలు ఇప్పటికే అనేక భారాలతో సతమతమవుతున్న ప్రజల పై ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం బస్సు చార్జీల పెంచడం వల్ల సామాన్య ప్రజలు బ్రతుకు మరింత దారుణంగా మారుతుందని ఎస్.ఎఫ్.ఐ జిల్లా సహాయ కార్యదర్శి వీరపోగు రవి, డివైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి ఒబులం పుల్లయ్య అన్నారు . సోమవారం ఎస్ ఎఫ్ ఐ డి వై ఎఫ్ ఐ రాష్ట్ర కమిటీల పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా బస్సు చార్జీల నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని బద్వేల్ డిపో ముందు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మేము అధికారంలోకి వస్తే ధరలు పెంచము అని చెప్పి ఇప్పుడు ధరలు విపరీతంగా పెంచి మాటతప్పడం మడమతిప్పడం సిగ్గుచేటు అన్నారు. ఇప్పటికే ధరలు ఆకాశాన్ని అంటిన పరిస్థితి ఉందన్నారు. రోజురోజుకూ పెరుగుతున్న పెట్రోలు, డీజిల్, గ్యాస్, ఇతర నిత్యావసర ధరలతో ప్రజలు బ్రతుకలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. తక్షణమే ప్రజల పై భారాలు వేయడం అపాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా విద్యార్థులు, నిరుద్యోగులకు తీవ్ర నష్టం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. బస్సు పాస్, కోన్ని రూట్లలో 50% చార్జీలు పెంచారు అని తెలిపారు. గతంలో ఉన్న క్యాట్ కార్డు ఇన్సూరెన్స్ సైతం తీసివేయడం సిగ్గుచేటు అన్నారు. కేంద్ర ప్రభుత్వం పన్నులు భారాలు వస్తుంటే మన ముఖ్యమంత్రి గంగిరెద్దులాగా తల అడించటం ఎమిటి అని ప్రశ్నించారు. నిరుద్యోగ పరిస్థితి మరింత దయనీయంగా ఉ ందని బస్సు చార్జీల పెంపు ప్రత్యక్షంగా వారి పై పడుతుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే బస్సు చార్జీలు పెంపు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఎఫ్.ఐ పట్టణ నాయకులు పవన్, రఘు, సుమంత్, ప్రవీణ్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులను ఇబ్బంది పెట్టకుండా పదవతరగతి హాల్ టికెట్లు ఇవ్వాలి

**ఎస్ ఎస్ యు ఐ జిల్లా అధ్యక్షుడు వీరేష్ యాదవ్**

ఎమ్మిగనూరు ఎమ్మిగనూరు పట్టణంలో ఫీజులు ,హాజరు శాతం ఫీజు చెల్లించాలని విద్యార్థులను ఇబ్బంది పెడుతున్న కార్పొరేట్,ప్రవేట్ విద్యాసంస్థలు బుధవారం నుంచి ప్రారంభమయ్యే పదవ తరగతి పరీక్షల హాల్ టికెట్ల లను కార్పొరేట్ ప్రైవేట్ విద్యా సంస్థలు ఫీజులు చెల్లించాలని, హాజరు శాతం ఫీజు చెల్లించాలని కొన్ని విద్యాసంస్థలు విద్యార్థులను ఒత్తిడికి గురి చేయడం తగదని,ఔజఎ జిల్లా అధ్యక్షుడు వీరేష్ యాదవ్ శనివారం మాట్లాడుతూ పరీక్ష సమయాలలో విద్యార్థులను ఒత్తిడికి గురి చేయడం తగదని, ప్రతి విద్యార్థికి ఇబ్బంది పెట్టకుండా హాల్టికెట్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖ అధికారులు విద్యాసంస్థలకు , ఇబ్బంది పెట్టకుండా మంజూరు చేయాలని ఆదేశాలు జారీ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 6,22,537 విద్యార్థులు పరీక్ష రాస్తున్నారని, పదిహేను నిమిషాలు ఆలస్యమైన పరీక్ష హాలోకిబ్ విద్యార్థులను అనుమతించాలని డిమాండ్ చేశారు. వేసవిని దృష్టిలో ఉ ంచుకొని పరీక్ష కేంద్రాల్లో తాగునీటి సౌకర్యం, మెడికల్ సెంటర్ ఏర్పాటు చేయాలని, పరీక్ష కేంద్రాలకు ప్రత్యేక ఆర్టీసీ బస్సులు నడపాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.


# జనసేనలోకి రాజశేఖర్

**టీడీపీ కి రాజీనామా**

గోకవరం, గోకవరం మండలం తంటికొండ గ్రామం చెందిన తెలుగుదేశం పార్టీ నాయకుడు కె రాజశేఖర్ జనసేన తీర్థం పుచ్చుకున్నారు.. టీడీపీ కి రాజీనామా చేసి జనసేనలోకి వెళ్తున్నట్లు రాజశేఖర్ తెలిపారు.శుక్రవారంరాజమండ్రివచ్చిన నాగేంద్ర బాబు ని కలిసి ఆయన సమక్షంలో జనసేన పార్టీలోకి చేరారు. జనసేన పార్టీ అధ్యక్షుడు కొణిదల పవన్ కళ్యాణ్ నాయకత్వానికి మద్దతు తెలుపుతూ జనసేన పార్టీకి జగ్గంపేట నియోజకవర్గ ఇన్చార్జ్ పాటంశెట్టి శ్రీదేవి సూర్యచంద్ర, కొణిదల నాగబాబు ఆధ్వర్యంలో...కంచుమర్తి రాజేష్ జనసేన పార్టీలో చేరడం జరిగిందని టౌన్ ప్రెసిడెంట్ మింది నాగేంద్ర తెలిపారు..ఈ కార్యక్రమంలో గోకవరం మండల అధ్యక్షుడు ఉంగరాల మణిరత్నం, జిల్లా సంయుక్త కార్యదర్శి దోసపాటి సుబ్బారావు, జనసేన సీనియర్ నాయకుడు ప్రగడ ప్రభ ,ప్రధానకార్యదర్శి చల్లపల్లి ప్రసాద్, జనసేన సీనియర్ నాయకుడు కన్నా , జనసేన సీనియర్ నాయకుడు ఉంగరాల శివ, జనసేన సీనియర్ నాయకుడు హరి, గోకవరం జనసైనికుడు కోటేష్, జన సైనికులు పాల్గొన్నారు..

# 'ఆచార్య' కోసం రంగంలోకి దిగబోతున్న పవన్..?

మెగాస్టార్ చిరంజీవి - మెగాపవర్ స్టార్ రామ్ చరణ్ కలిసి నటించిన 'ఆచార్య' సినిమా విడుదలకు సిద్ధమైంది. సక్సెస్ ఫుల్ డైరెక్టర్ కొరటాల శివ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం.. ఏప్రిల్ 29న ప్రేక్షకుల ముందుకు రానుంది. రిలీజ్ కు గట్టిగా వారం రోజులు మాత్రమే ఉండటంతో మేకర్స్.. జెట్ స్పీడ్ తో ప్రమోషన్స్ చేయడానికి ప్లాన్ చేసుకున్నారు.ఇందులో భాగంగా ఏప్రిల్ 23న హైదరాబాద్ లోని యూసఫ్ గూడ పోలీస్ గ్రౌండ్స్ లో 'ఆచార్య' ప్రీ రిలీజ్ ఈవెంట్ ని గ్రాండ్ గా నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నారు. నిజానికి విజయవాడలో ఈ వేడుకను జరపాలని అనుకున్నారట. కారణమేంటో



తెలియదు కానీ ఇప్పుడు వేదికను షిఫ్ట్ చేసుకున్నారు. అయితే దీనికిచిత్ర బృందంతో పాటుగా ఎవరెవరు గెస్టులుగా వస్తారనేది హాట్ టాపిక్ గా మారింది.'ఆచార్య' ప్రీ-రిలీజ్ ఈవెంట్ కి బాలీవుడ్ స్టార్ హీరో సల్మాన్ ఖాన్ చీఫ్ గెస్ట్ గా హాజరు కానున్నారని టాక్ వచ్చింది. ఇప్పుడు తాజాగా పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ - దర్శకధీరుడు ఎస్ఎస్ రాజమౌళి మరియు తెలంగాణ ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రానున్నారని ప్రచారం జరుగుతోంది.కొరటాల శివ 'ఆచార్య' చిత్రాన్ని నక్సలిజం బ్యాక్ డ్రాప్ లో సందేశాత్మక అంశాలతో కూడిన కమర్షియల్ మూవీగా తీర్చిదిద్దారు. కథంతా కమ్యూనిస్ట్ సిద్ధాంతాలు మరియు సోషలిస్ట్ విధానాల చుట్టూ తిరుగుతుందని తెలుస్తోంది. ఇప్పుడు అలాంటి భావాలు కలిగిన పవన్ కళ్యాణ్ ఈ సినిమా ప్రీ-రిలీజ్ ఈవెంట్ కి సరైన గెస్ట్ అని మెగా ఫ్యాన్స్ భావిస్తున్నారు. లేటెస్టుగా ఆర్.ఆర్.ఆర్ సినిమాతో సెన్సేషన్ క్రియేట్ చేసిన రాజమౌళి.. రామ్ చరణ్ కోసమైనా 'ఆచార్య' సినిమా ఈవెంట్ లో భాగమయ్యే అవకాశం ఉంది.పవన్ కళ్యాణ్ 'ఆచార్య' ఈవెంట్ కు రాబోతున్నాడనే వార్తల్లో నిజమెంతన్నది తెలియదు కానీ.. అదే జరిగితే మెగా అభిమానులకు సినిమా విడుదలకు ముందే పండగ వచ్చినట్లే అవుతుంది. చాలాకాలం తర్వాత మెగా బ్రదర్స్ అండ్ సన్స్ ని ఒకే స్టేజీ మీద చూసే అరుదైన అవకాశం కలుగుతుంది. ఇది నిజంగా ఫ్యాన్స్ కు కనులవిందు అని చెప్పడంలో సందేహం లేదు.అలానే పవన్ ఈ వేదికపై ఎలాంటి స్పీచ్ ఇస్తారు? ఇది సినిమా ఓపెనింగ్స్ కు ఎంత వరకు హెల్ప్ అవుతుందనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. మెగా తండ్రీకొడుకులు తొలిసారిగా కలిసి నటిస్తున్న పూర్తి స్థాయి సినిమా కావడంతో 'ఆచార్య' కోసం మెగా అభిమానులు ఆతృతగా ఎదురుచూస్తున్నారు. ఇందులో చిరంజీవికి జోడీగా కాజల్ అగర్వాల్.. రామ్ చరణ్ సరసన పూజా హెగ్దే హీరోయిన్లుగా నటించారు.కొణిదెల ప్రొడక్షన్స్ సమర్పణలో మ్యాట్నీ ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ పై నిరంజన్ రెడ్డి - అన్వేష్ రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మించారు. మణిశర్మ సంగీతం సమకూర్చగా.. తిరునవుక్కరసు సినిమాటోగ్రఫీ అందించారు. సురేష్ సెల్వరాజన్ ప్రొడక్షన్ డిజైనింగ్ చేయగా.. నవీన్ నూలి ఎడిటింగ్ వర్క్ చేస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ప్రమోషనల్ కంటెంట్ ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంది. మరి చిరు - చరణ్ కలిసి చేసిన ఈ 'ఆచార్య' సినిమా ఎలాంటి విజయాన్ని అందుకుంటుందో చూడాలి.

# నేచురల్ స్టార్ దృష్టిలో పాన్ ఇండియా అంటే అది!

టాలీవుడ్ నుంచి ప్రధానంగా పాన్ ఇండియా చిత్రాల పరంపర కొనసాగుతోంది. 'బాహుబలి' నుంచి ఈ తరహా చిత్రాల దండయాత్ర మొదలైంది. ప్రస్తుతం చాలా చిత్రాలు ఇదే ఫార్ములా నేపథ్యంలో రూపొందుతున్నాయి. కూడా. ఇటీవల విడుదలైన రాధేశ్యామ్ బ్లాక్ బస్టర్ హిట్ గా నిలవకపోయినా పాన్ ఇండియా రేంజ్ లో విడుదలైంది. ఆ తరువాత వచ్చిన 'ట్రిపుల్ ఆర్' పాన్ ఇండియా వైడ్ గా రికార్డుల మోత మోగించింది.



రీసెంట్ గా కన్నడ నుంచి వచ్చిన 'కేజీఎఫ్ 2' కూడా పాన్ ఇండియా వ్యాప్తంగా వసూళ్ల వర్షం కురిపిస్తూ సంచలనాలు సృష్టిస్తోంది.ఇదే కోవలో మరిన్ని పాన్ ఇండియా చిత్రాలు సిద్ధమవుతున్నాయి. ఈ నేపథ్యంలో నేచురల్ స్టార్ నాని పాన్ ఇండియా మూవీస్ పై తాజాగా సంచలన వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యతను సంతరించుకుంది. నాని నటిస్తున్న తాజా చిత్రం 'అంటే సుందరానికి'. వివేక్ ఆత్రేయ డైరెక్ట్ చేస్తున్న ఈ మూవీని మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ పై అత్యంత భారీ స్థాయిలో ఈ మూవీని ని నిర్మిస్తున్నారు. మలయాళ నటి నజ్రియా నజీమ్ హీరోయిన్ గా నటిస్తున్న ఈ చిత్రాన్ని తెలుగుతో పాటు తమిళ మలయాళ భాషల్లో ఏక కాలంలో విడుదల చేస్తున్నారు.రొమాంటిక్ ఎంటర్ టైనర్ గా రూపొందుతున్న ఈ చిత్రాన్ని జూన్ 10న భారీ స్థాయిలో విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా చిత్ర బృందం బుధవారం ఈ మూవీ టీజర్ ని రిలీజ్ చేసింది. ఈ సందర్భంగా ఓ ఈవెంట్ ని హైదరాబాద్ లో నిర్వహించింది. ఈ కార్యక్రమంలో హీరో నానితో పాటు హీరోయిన్ నజ్రియా నజీమ్ టీమ్ మెంబర్స్ అంతా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఓ పాత్రికేయుడు పాన్ ఇండియా సినిమా మీ నుంచి ఎప్పుడు అని అడిగిన ప్రశ్నకు హీరో నాని ఆసక్తికరంగా స్పందించారు.పాన్ ఇండియా అంటే ఏంటో నాకు తెలియదు. ఎందుకంటే ఇప్పుడు దేశమంతా మంచి పేరొస్తే .. ఎక్కడెక్కడో వున్న వాళ్లంతా మన తెలుగు సినిమాని చూసి.. ఫోన్ చేసి చాలా బాగుందంటే అది పాన్ ఇండియా కిందే లెక్క. ఇప్పుడు 'దసరా' సినిమా తెలుగుతో పాటు హిందీ లోనూ విడుదల కానుంది. అంతే కాకుండా ఇతర భాషల్లోనూ విడుదల కాబోతోంది. అయితే ఇండియాలోని ప్రతీ కార్నర్ లో రిలీజ్ అయ్యే సినిమానే నా దృష్టిలో పాన్ ఇండియా సినిమా. ఇప్పుడు ప్రతీ సినిమాకు పాన్ ఇండియా అనే ట్యాగ్ ని తగిలించడం నా దీష్టిలో కరెక్ట్ కాదు.ఎక్కడెక్కడో వున్న ప్రేక్షకులు తెలుగు సినిమా భలే వుందంటరా అని వెతుక్కుని ఓటీటీలో అయినా చేసే లాంటి సినిమాలు చేద్దాం. అవే నిజమైన పాన్ ఇండియా ఫిలింస్ అని నా ఫీలింగ్' అని పాన్ ఇండియా సినిమా అంటే తన దృష్టిలో ఏంటో నిర్మొహమాటంగా క్లారిటీ ఇచ్చేశారు నాని. నాని మాటలు విన్న వాళ్లంతా కేవలం ఐదు భాషల్లో విడుదలైన సినిమాలే పాన్ ఇండియా సినిమాలా? అని చర్చించుకుంటున్నారు.

# అహ అహ అనిపిస్తారట

విక్టరీ వెంకటేష్ మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ కలిసి నటించిన ఫ్యామిలీ ఎంటర్ టైనర్ 'ఎఫ్ 2'. అనిల్ రావిపూడి డైరెక్షన్ లో శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్ పై దిల్ రాజు శిరీష్ సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రం ఫన్ అండ్ ఫ్రస్టేషన్ తో ఆద్యంతం ఆకట్టకుంది. అంతే కాకుండా బాక్సాఫీస్ వద్ద ఊహించని విధంగా వసూళ్ల వర్షం కురిపించి ఔరా అనిపించింది. ఏకంగా వంద కోట్ల క్లబ్ లో చేరిన ఈ చిత్రం వసూళ్ల పరంగా ట్రేడ్ వర్గాలని విస్మయానికి గురిచేసింది.దీంతో ఈ చిత్రానికి సీక్వెల్ గా 'ఎఫ్ 3'ని అదే టీమ్ తో తెరకెక్కించారు అనిల్ రావిపూడి. తమన్నా మెహ్రీన్ హీరోయిన్ లుగా నటించిన ఈ చిత్రం మే 27న భారీ స్థాయిలో రిలీజ్ కాబోతోంది. ఫస్ట్ పార్ట్ తో పోలిస్తే మరిన్ని ప్రత్యేకతలతో ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. సునీల్ అంజలి సోనాల్ చౌహాన్ తో పాటు బుట్టబొమ్మ పూజా హెగ్దేపై ప్రత్యేక గీతాన్ని కూడా చిత్రీకరించడంతో ఈ సినిమాపై అంచనాల్ని పెంచేసింది. ఫస్ట్ పార్ట్ ని మించి వినోదంతో తెరకెక్కించిన ఈ మూవీ రిలీజ్ దగ్గరపడుతున్న నేపథ్యంలో మేకర్స్ ప్రమోషన్స్ ని ప్రారంభించేశారు.అందులో భాగంగా 'ఊ...ఆ.. ఆహా ఆహా..' అంటూ సాగే లిరికల్ వీడియోని విడుదల చేయబోతున్నారు. ఈ పాటని ఏప్రిల్ 22న రిలీజ్ చేస్తున్న నేపథ్యంలో ముందుగా లిరికల్ ప్రోమోని విడుదల చేసింది చిత్ర బృందం.విక్టరీ వెంకటేష్ తమన్నా వరుణ్ తేజ్ - మెహ్రీన్ సునీల్ లపై ఈ పాటని చిత్రీకరించారు. ఈ పాటతో ఊ ఆ..అహ అహ అనిపిస్తారట. దేవి శ్రీప్రసాద్ సంగీతం అందించిన ఈ పాటకు కాసర్ల శ్యామ్ సాహిత్యం అందించారు.సునిధి చౌహాన్ లవిత లోబో సాగర్ ఎస్పీ అభిషేక్ ఆలపించారు. ఈ పాటలో హీరోయిన్ లిద్దరు ఊ ఆ..అహ అహ అనిపించేలా వున్నారు. ఫ్యామిలీ ఎంటర్ టైనర్ ని ఈ పాటతో మరింత స్పైసప్ చేపినట్టుగా కనిపిస్తోంది. బ్లాక్ సారీలో స్లీవ్ లెస్ బ్లౌజ్ లో మిల్కీ బ్యూటీ రచ్చ రచ్చ చేసినట్టుగా తెలుస్తోంది. ఇక మెహ్రీన్ కూడా అదే స్థాయిలో బ్లూ సారీ.. స్లీవ్ లెస్ బ్లౌజ్ ధరించి హోయలు పోయింది. వెంకీ వరుణ్తేజ్ తమన్నా మెహ్రీన్ కలిసి రచ్చ చేసిన ఈ పాటలో సునీల్ తనదైన స్టెప్పులతో మెరిపించబోతున్నాడు.గత కొన్ని రోజులుగా వరుసగా వాయిదాలు పడుతూ వస్తున్న ఈ మూవీ ఎట్టకేలకు మే 27న థియేటర్లలో సందడి చేయబోతోంది. ఫస్ట్ పార్ట్ ని మించి 'ఎఫ్ 3'ని అనిల్ రావిపూడి ఏ రేంజ్ లో తెరకెక్కించదాఓ తెలియాలంటే మే 27 వరకు వేచి చూడాల్సిందే. అంజలి రాజేంద్ర ప్రసాద్ సునీల్ మురళీశర్మ అలీ తులసీ ఝాన్సీ ప్రగతి ప్రదీప్ వై.విజయ అన్నపూర్ణమ్మ తదితరులు నటించారు.

# అప్పుడూ.. ఇప్పుడూ ధోని వలలో చిక్కిన పొలార్డ్! ఇగోకు పోయి బొక్కబోర్లా పడి..



ముంబై ఇండియన్స్ హిట్టర్ కీరన్ పొలార్డ్ తీరుపై టీమిండియా మాజీ క్రికెటర్ ఇర్ఫాన్ పఠాన్ విమర్శలు గుప్పించాడు. నాకు తిరుగులేదు అన్న అహంభావంతోనే చెన్నై సూపర్‌కింగ్స్‌తో మ్యాచ్‌లో వికెట్ కోల్పోయాడంటూ ఘాటు వ్యాఖ్యలు చేశాడు. ఇకనైనా ఇగోను పక్కనపెట్టి జట్టు ప్రయోజనాల కోసం ఆడాలని సూచించాడు. కాగా ఐపీఎల్-2022లో భాగంగా చెన్నైతో గురువారం జరిగిన మ్యాచ్‌లో ముంబై పరాజయం పాలైన సంగతి తెలిసిందే.ఆఖరి బంతికి ధోని ఫోర్ బాదడంతో మూడు వికెట్ల తేడాతో ఓటమి పాలై వరుసగా ఏడో పరాజయాన్ని? మూటగట్టుకుంది. ఓపెనర్లు రోహిత్ శర్మ(0), ఇషాన్ కిషన్(0) పూర్తిగా విఫలం కాగా... వన్‌డౌన్‌లో వచ్చిన డెవాల్డ్ బ్రెవిస్ 4 పరుగులకే పెవిలియన్ చేరాడు. ఈ క్రమంలో సూర్యకుమార్ యాదవ్(32), తిలక్ వర్మ(51) కలిసి ఇన్నింగ్స్ చక్కదిద్దే ప్రయత్నం చేశారు. ఆఖర్లో 9 బంతుల్లో ఒక ఫోర్, ఒక సిక్సర్ బాది 14 పరుగులు సాధించిన పొలార్డ్ భారీ స్కోరు చేసేలా కనిపించాడు.అయితే, ప్రమాదకరంగా పరిణమిస్తున్న పొలార్డ్‌ను పెవిలియన్‌కు పంపేందుకు చెన్నై మాజీ కెప్టెన్ ధోని ఫీల్డ్ సెట్ చేశాడు. తలైవా మాస్టర్ ప్లాన్‌లో చిక్కుకున్న ఈ భారీ హిట్టర్ మహీశ్ తీక్షణ బౌలింగ్‌లో శివమ్ దూబేకు క్యాచ్ ఇచ్చి అవుటయ్యాడు. మహీశ్ సంధించిన క్యారమ్ బాల్‌ను తేలికగా తీసుకుని డీప్‌లో ఉన్న దూబేకు దొరికిపోయి వికెట్ సమర్పించుకున్నాడు. ఒకరకంగా చెప్పాలంటే ధోనికి కౌంటర్

ఇవ్వాలనే ఉద్దేశంతో ఇగోకు పోయి బొక్కబోర్లా పడ్డాడు.ఈ నేపథ్యంలో ఇర్ఫాన్ పఠాన్ స్టార్ స్పోర్ట్స్ షోలో మాట్లాడుతూ.. "స్ట్రెయిట్ షాట్లు ఆడటమే పొలార్డ్ బలం. అందుకే అక్కడ వాళ్లు(సీఎస్‌కే) ఫీల్డర్‌ను పెట్టారు. కాబట్టి పొలార్డ్ కాస్త ఆచితూచి ఆడాల్సింది. కానీ అతడు అప్పుడు కూడా స్ట్రెయిట్ షాట్ ఆడేందుకే మొగ్గు చూపాడు. మూల్యం చెల్లించాడు. మంచి ఇన్నింగ్స్ ఆడుతూ.. మ్యాచ్‌లు గెలిపిస్తూ కీలక ప్లేయర్‌గా అవతరించిన తర్వాత.. "మీరు నాకోసం వల పన్నారు కదా! చూడండి నా బలమేమిటో చూపిస్తా" అన్నట్లుగా పొలార్డ్ వ్యవహరించాడు. ఫలితంగా వికెట్ సమర్పించుకున్నాడు" అని పేర్కొన్నాడు. 12 ఏళ్ల క్రితం ఇదే తరహాలో ఐపీఎల్-2010 ఫైనల్లో సీఎస్‌కేతో మ్యాచ్‌లో పొలార్డ్ అవుటైన సంగతి తెలిసిందే. ఆల్బీ మోర్కెల్‌కు బంతిని ఇచ్చిన ధోని మిడాఫ్‌లో మాథ్యూ హెడెన్ ఫీల్డర్‌గా పెట్టగా.. పొలార్డ్ అతడికి క్యాచ్ ఇచ్చి పెవిలియన్ చేరాడు. ఈ మ్యాచ్‌లో ముంబైపై 22 పరుగుల తేడాతో గెలుపొందిన ధోని సేన టైటిల్ ఎగురేసుకుపోయింది.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL - 518 001. ANDHRA PRADESH.**
**PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**